ప్రజాశక్తి

సోమవారం 29 జులై 2024 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

బాగు.. జాగు..

- అధ్వానంగా కాల్వల నిర్వహణ
- ఆలస్యంగా మరమ్మతులు
- ఇబ్బందుల్లో రైతులు

తాడేపల్లి వద్ద గుంటూరు ఛానల్‌లో తూటికాడ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లాలో కాల్వలను బాగు చేసే పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయి దాదాపు 45 రోజులు దాటినా ఇప్పటికీ కాల్వలను శుభ్రపరిచే పనులు మందగమనంగా సాగుతున్నాయి. కృష్ణాపశ్చిమ డెల్టాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయిన తరువాత టెండర్లు ఖరారు చేశారు. ఏప్రిల్, మేనెలలో చేయాల్సిన పనులకు జూన్‌లో టెండర్లు ఖరారు చేసి జులై చివరి వారంలో పనులు చేపట్టడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో మొత్తం 240 పనులకు రూ.22 కోట్ల అంచనాలతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గత ఫిబ్రవరిలోనే ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి నివేదిక పంపినా నిధులు మంజూరులో జాప్యం జరిగింది.

పశ్చిమ డెల్టా ప్రాంతంలో 5.70 లక్షల ఎకరాలలో పంటలు సాగవుతున్నాయి. ఎగువ నుంచి విడుదల చేసే నీటిని డెల్టాలోని చివరి భూములకు నీరు పారేలా కాల్వలు, మురుగు కాల్వలు శుభ్రం చేయాల్సిన నీటిపారుదల శాఖ అధికారులు నిధులు మంజూరులో జాప్యం వల్ల గత నెల వరకు పట్టించుకోలేదు. ఎన్నికల కోడ్, ప్రభుత్వం మారడంతో పనులు చేపట్టడంలో జాప్యం జరిగిందని అధికారులు చెబుతున్నా ఏటా ఖరీఫ్‌సీజన్ ప్రారంభం అయిన పనులు చేపట్టడం పరిపాటిగా మారింది. గతనెల చివరి వారంలో మరమ్మతులకు రూ.13.62 కోట్ల నిధులు మంజూరయ్యాయి. తెనాలి డివిజన్‌లో 85 పనులకు రూ.రూ.4.98 కోట్లు, రేపల్లె డ్రెయినేజి డివిజన్‌లో 61 పనులకు రూ.3.56 కోట్లు, చీరాల డివిజన్‌లో 37 పనులకు రూ.3.75 కోట్లు, గుంటూరు ఛానల్ పరిధిలో ఆరు పనులకు రూ.1.31 కోట్లు కేటాయించారు. ఈ పనులకు టెండర్లు ఖరారుకు ఈనెల మొదటి వారం సమయం పట్టింది. పనులు

2లో

సమావేశంలో మాట్లాడుతున్న సిహెచ్ బాబూరావు

సామాన్యుల నడ్డి విరిచేలా కేంద్ర బడ్జెట్

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు
- శ్వేతపత్రాల పేరుతో హామీలపై వెనక్కు తగ్గొద్దు
- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య
- వరికపూడిశెల నిర్మాణానికి నిధులు కేటాయించాలి
- సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్

ప్రజాశక్తి-సత్తెనపల్లి

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకు అనుకూలమైన, సామాన్యుల నడ్డి విరిచే బడ్జెట్ అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన సిపిఎం పల్నాడు జిల్లా శాఖ కార్యదర్శుల విస్తృత సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు అధ్యక్షతన నిర్వహించారు. బాబూరావు మాట్లాడుతూ దేశం ఎదుర్కొంటున్న కీలకమైన సమస్యలు పరిష్కారం చూపించేదిగా బడ్జెట్ లేదన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు బిజెపికి మెజారిటీ లేకుండా చేసినా దాని తీరు మాత్రం మారలేదని అన్నారు. టిడిపి మద్దతు మీద ఆధారపడ్డా ప్రస్తుత నేపథ్యంలోనైనా రాష్ట్రానికి న్యాయం జరుగుతుందని ఆశించినా ఆదీ లేదన్నారు. అమరావతికి గ్రాంట్ కాకుండా అప్పులు ఇవ్వటం అంటే వైసిపి ప్రభుత్వం అప్పులు చేసి ముంచేసిందని, మళ్లీ కొత్త అప్పులను తెచ్చిపెట్టారని విమర్శించారు. బీహార్‌కు రూ.58 వేల కోట్లు కేటాయించిన కేంద్రం ఆంధ్రప్రదేశ్ రాజధానికి అప్పులు, పోలవారానికి, మిగతా విభజన హామీల అమలుకి మాటలతో సరిపెట్టిందన్నారు. దేశవ్యాప్తంగా ప్రజల మధ్య మత విద్వేషాలు రగిలించి మతోన్మారాన్ని మరింత రెచ్చగొట్టే చర్యలకు బిజెపి పాల్పడుతోందని విమర్శించారు. పార్లమెంట్‌లో,

2లో

ప్రతి చిన్నారిలోనూ ఏదోఒక ప్రతిభ

బహుమతులు అందుకుంటున్న మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో విజేతలు

- సెల్‌ఫోన్లను దూరంగా ఉంచి ప్రోత్సహిస్తే ఉన్నత స్థాయికి
- సృజనాత్మకతను ప్రోత్సహించాల్సింది తల్లిదండ్రులు, ఉపాధ్యాయులే
- ముగిసిన ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ 'పల్నాడు స్టూడెంట్, యూత్ ఫెస్ట్'

4లో

ఇసుక రీచ్‌లోని జెసిబి, వాహనాలు సీజ్

ప్రజాశక్తి - అచ్చంపేట

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న జెసిబి, ఆరు వాహనాలను మైనింగ్ అధికారులు ఆదివారం సీజ్ చేశారు. మండలంలోని కొత్తపల్లి ఇసుక రీచ్‌లో అనుమతులు లేకుండా ఇసుక లోడింగ్ జరుగుతుందనే సమాచారంతో మైనింగ్ అధికారులు ఆదివారం తెల్లవారుజామున తనిఖీలు చేశారు. ఇసుక లోడ్ చేస్తున్న జెసిబి, ఇసుకను తరలించేందుకు సిద్ధంగా ఉన్న మూడు లారీలు, మూడు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వీటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

గుంటూరు జిల్లాలో భారీగా తహశీల్దార్ల బదిలీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

జిల్లాలో పలువురు తహశీల్దార్ల బదిలీలను చేసూ జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ ఉత్తర్వులు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో భాగంగా ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న తహశీల్దార్లను నెల్లూరు, ప్రకాశం జిల్లాకు పంపిన విషయం తెలిసిందే. వీరంతా ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తరువాత తిరిగి వారు పనిచేస్తున్న జిల్లాలకు పంపుతూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఐదుగురు డిప్యూటీ తహశీలార్లకు పూర్తి అదనపు బాధ్యతలతో దుగ్గిరాల, తాడేపల్లి, తుళ్లూరు, గుంటూరు తూర్పు, పొన్నూరు మండల తహశీల్దార్లుగా నియమించారు. తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు వీరు ఆయా మండలాల్లో కొనసాగుతారని కలెక్టర్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 18 మండలాలకు తహశీల్దార్లను కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఉత్తర్వులు శనివారం జారీ చేయగా ఆదివారం వెలుగుచూశాయి.

తహశీల్దార్	మండలం
జి.వి.ఎస్.ఫణీంద్రబాబు	గుంటూరు పశ్చిమ
డి.పద్మనాభుడు	మేడికొండూరు
ఎస్.శ్రీకాంత్	పెదనందిపాడు
జి.నాంచారయ్య	ఫిరంగిపురం
కె.రవిబాబు	ప్రత్తిపాడు

తహశీల్దార్	మండలం
కె.నాసరయ్య	తాడికొండ
జి.సిద్ధార్థ	కొల్లిపర
కె.శ్రీనివాసశర్మ	చేబ్రోలు
బి.వెంకటస్వామి	కాకుమాను
షేక్‌మహబూబ్ సుభానీ	మంగళగిరి
కె.వి.గోపాలకృష్ణ	తెనాలి
పి.నగేష్	పెదకాకాని
ఎం.నాగిరెడ్డి	వట్టిచెరకూరు
ఎం.పూర్ణచంద్రరావు	ఎ.వో.కలెక్టరేట్
కె.మల్లేశ్వరి	సి సెక్షన్, కలెక్టరేట్
కె.సాంబశివరావు	కలెక్టరేట్ భూపరిపాలన
షేక్ ఇస్మాయిల్	కలెక్టరేట్ కోఆర్డినేషన్
కె.కల్యాణి	ఆర్‌డివో ఆఫీసు ఎ.వో
జె.ప్రసాదరావు	సబ్‌కలెక్టర్ ఆఫీసు తెనాలి ఎ.వో
యు.రాజేష	దుగ్గిరాల
ఎన్.సతీష్	తాడేపల్లి
పి.వసంతరావు	తుళ్లూరు
షేక్ రిజ్వాన	గుంటూరు తూర్పు
ఐ.ప్రశాంతి	పొన్నూరు

బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన వృద్ధిడిపై కేసు

ప్రజాశక్తి - నాదెండ్ల

బాలికపట్ల అసభ్యంగా ప్రవర్తించిన వృద్ధిడిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఎస్ఐ బలరామిరెడ్డి వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన యడ్లపాడుకు చెందిన మౌలాలి చిలకలూరిపేటలో తన కుమారుడు వద్ద ఉంటూ గణపురంలోని చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. స్కూల్ ముగిసన అనంతరం ఇంటికి వెళ్తున్న బాలికకు డబ్బులు ఆశ చూపి షాపులోకి పిలిచి అసభ్యంగా ప్రవర్తించడంతో ఇది తెలిసిన బాలిక తల్లిదండ్రులు నిలదీశారు. వారి నుండి తప్పించుకున్న మౌలాలీ పరారవడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

తాగునీటి సరఫరాలో సమయపాలన ఏది ?

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్ : పట్టణంలో త్రాగునీటి విడుదలలో మున్సిపల్ అధికారులు సమయపాలన పాటించక పోవటం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. త్రాగునీరు రోజుమార్చి రోజు ఇవ్వటం వలన సమయపాలన పాటించకుండా అధికారుల ఇష్టారాజ్యాంగ నీటిని విడుదల చేయటం వలన ప్రజలు తీవ్ర అయోమయంలో ఉన్నారు. ఒక్కో రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు, ఒక్కోసారి సాయంత్రం 4 గంటలకు, ఒక్కోరోజు మధ్యాహ్నం 2.30 గంటలకు సరఫరా చేయడం వల్ల జనం గందరగోళ పడుతున్నారు. నీరు అవసరమైనప్పుడు బయట నుండి కొనాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. నీటి విడుదలలో అధికారులు ముందస్తు ప్రకటన చేయాలని కోరుతున్నారు.

బాగు.. జాగు..

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టడానికి కూడా జాప్యం జరిగింది. తూటుకాడ, పిచ్చిమొక్కల తొలగింపుతో పాటు నీరు సాఫీగా పారుదలకు కాల్వలను సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కాల్వలకు నీరు విడుదల చేసేలోగా పనులను పూర్తి చేయాలని చెప్పినా ఇప్పటికీ ఈ పనులు పూర్తి కాలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలోని వివిధ కాల్వల్లో పేరుకుపోయిన తూటికాడ వల్ల నీరు ముందుకు సాగక పొలాలు ముంపునకు గురయ్యాయి. గత కొంత కాలంగా కాల్వలకు కనీస మరమ్మతులు లేకపోవడం వల్ల భారీ వర్షాలకు సైతం ముంపు సమస్య వస్తోంది. గుంటూరు కాల్వ,వివిధ మేజర్ల పరిధిలో తూటికాడ తొలగింపు ఇప్పటికీ పూర్తికాలేదు. దీంతో కాల్వలకు నీరు విడుదల చేసినా చివరి భూములకునీరు అందక ఎక్కడికక్కడే నిలిచిపోయిన పరిస్థితి నెలకొంది. ప్రధానంగా మురుగునీటిపారుదల విభాగంలో కనీస మరమ్మతులు లేకపోవడంతో పొలాల్లోకి నీరు చేరి రైతులకు ఇబ్బందికరంగా మారింది. పొలాల్లోని వర్షపు నీరు బయటకు పంపేందుకు కాల్వలు సక్రమంగా లేక రైతులు గత ఏడాది ఇబ్బంది పడుతున్నారు. వెదపద్ధతిలో వరి సాగు చేసిన రైతులకు ముంపు సమస్య తీవ్రంగా ఉంది. గత ఏడాది కూడా మరమ్మతులు తూతూ మంత్రంగా జరిగాయి. అవి కూడా ఆలస్యంగా చేపట్టారు. ఈ ఏడాది కూడా ఇదే పరిస్థితి నెలకొంది. పనులు జాప్యం వల్ల గతేడాది డిసెంబరులో మీచౌంగ్ తుపాను వల్ల వరి, పత్తి,మిరప పైర్లునీట మునిగాయి. ఈ ఏడాది సాధారణ వర్షాలకు వరి పైరు సాగు చేసిన పొలాల్లో నీరు చేరి రైతులు నానా తంటాలు పడ్డారు. మంగళగిరి, తెనాలి, పొన్నూరు నియోజకవర్గాల్లో ముంపు సమస్య రైతులకు కంటిమీద కునుకులేకుండా చేసింది.

సామాన్యుల నడ్డి విరిచేలా కేంద్ర బడ్జెట్

(మొదటి పేజీ తరువాయి)

బయట రాబోయే కాలంలో సిపిఎం, వామపక్షాలు, ఇండియా వేదిక పార్టీ పోరాటాలు కొనసాగిస్తాయన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకొని ప్రజలు గెలిపించారని, వీలైనంత త్వరగా సూపర్ సిక్స్ హామీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్టమైన కార్యాచరణను ప్రకటించాలని కోరారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు మీద శ్వేతపత్రాలు ప్రకటించడం మంచిదే కాని శ్వేతపత్రాల ద్వారా ప్రజలకి వాస్తవాలు తెలియజేయాలి తప్ప శ్వేతబత్రాల పేరుతో ఆర్థిక సంక్షోభాన్ని అడ్డంపెట్టి ప్రజలకి ఇచ్చిన హామీలు అమలు చేయటం మీద వెనకాడితే ప్రజల హర్షించరన్నారు. కేంద్రం నుండి నిధులు రాబట్టడంపై టిడిపి, జనసేన కేంద్రం మీద ఒత్తిడి చేయాలన్నారు. బిజెపి పట్ల వైసిపి వైఖరి మారలేదన్నారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ రాబోయే రాష్ట్ర బడ్జెట్లో వరికపూడిశెల నిర్మాణానికి నిధులు కేటాయించాలని డిమాండ చేశారు. జిల్లాలో ఉపాధి హామీ కూలీల పెండింగు బకాయిలు రూ.40 కోట్ల వెంటనే విడుదల చేయాలన్నారు. సమావేశంలో తొలుత ఇటీవల మరణించిన సిపిఎం నాయకులు గుదిబండి నాగిరెడ్డికి సంతాపం తెలిపారు. పల్నాడు జిల్లా పంటల సాగు ప్రణాళికను వెంటనే ప్రకటించాలని సమావేశం తీర్మానించింది. సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య, జిల్లా కార్యదర్శి వరకు సభ్యులు ఎవిఎన్ గోపాల్‌రావు, ఎ.లక్ష్మీశ్వర్‌రెడ్డి, వై.రాధాకృష్ణ, ఎస్.ఆంజనేయ నాయక్, నాయకులు జి.బాలకృష్ణ, జి.పిచ్చారావు, జి.ఉమశ్రీ, కె.హనుమంతరావు, ఎ.వీరబ్రహ్మం, కె.శివదుర్గారావు, జి.మల్లీశ్వరి, పి.మహేష్, ఆంజనేయరాజు, సాయి పాల్గొన్నారు.

ఉద్యమానికి గాజులిచ్చిన దంపతులకు సత్కారం

రచ్చబండ ను ప్రారంభిస్తున్న రైతులు అఖిలాండమ్మ, రామాంజనేయులు దంపతులు

ప్రజాశక్తి - తుళ్లూరు

అమరావతి ఉద్యమానికి బంగారు గాజులు అందజేసిన రైతులను సత్కరించారు. తుళ్లూరు గ్రామానికి చెందిన కొమ్మినేని అఖిలాండమ్మ రామాంజనేయులు దంపతులు అమరావతి ఉద్యమం ఉదతంగా సాగుతున్న సమయంలో రెండు బంగారు గాజులను అందజేశారు. వారిని రాజధాని ప్రాంత రైతులు,మహిళలు శాలువాలు కప్పి సత్కరించారు. ఆదివారం స్థానిక అయ్యన్న చెరువు కట్టపై టిడిపి మండల మాజీ అధ్యక్షులు జొన్నలగడ్డ కిరణ్ కుమార్ రూ 1.50 లక్షలతో నిర్మించిన రచ్చబండను అఖిలాండమ్మ రామాంజనేయులు దంపతులు ప్రారంభించారు.ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ, అమరావతి ఉద్యమానికి అఖిలాండమ్మ తన రెండు బంగారు గాజులను చంద్రబాబు ద్వారా అమరావతి ఉద్యమం కోసం అందించి పెద్ద మనస్సు చాటుకున్నారని అన్నారు. ఎమ్మెల్యే, ఎంపిగా శ్రావణ్ కుమార్,పెమ్మసాని చంద్ర శేఖర్ ను గెలిపించిన రాజధాని ప్రాంత ప్రజలకు ఆయన కతజ్ఞత తెలిపారు.కార్యక్రమంలో రైతు జెఎసి నాయకులు పాల్గొన్నారు.

రాజధానికి రూ.15 వేల కోట్లు కేటాయించడం హర్షణీయం

రైతులు దొంతిరెడ్డి సాంబిరెడ్డి, మేకా శ్రీధర్ రెడ్డి

ప్రజాశక్తి-తాడేపల్లి

రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో 15 వేల కోట్ల రూపాయలు కేటాయించడం ప్రజలందరూ ఆనందపడే అంశమని టీడీపీ తెలుగు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి దొంతిరెడ్డి సాంబిరెడ్డి, మేకా శ్రీధర్ రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి శుభదినమని రాష్ట్ర పునర్నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని మోడీ ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని అన్నారు. ఏపీ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చిన ఎన్డీఏ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అమరావతికి చంద్రబాబు పూర్వవైభవం తీసుకురానున్నారు. కేంద్ర బడ్జెట్‌లో పోలవరం ప్రాధాన్యత ఇస్తూ నిధులు ఇస్తామనడం, వెనుకబడిన జిల్లాలకు అధిక ప్రాధాన్యత ఇస్తామనడం మంచి పరిణామమని పేర్కొన్నారు.

మత్స్యకార కుటుంబాలు బాగుండాలి

పోలకంపాడు ఫిషర్ మ్యాన్ సొసైటీ అధ్యక్షులు సైకం మల్లేశ్వరరావు

ప్రజాశక్తి-తాడేపల్లి

మత్స్యకార కుటుంబాలు, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని నాగుల్ మీరా జెండాను ఎత్తి కందూరు జరుపుకుంటామని పోలకంపాడు ఫిషర్ మ్యాన్ సొసైటీ అధ్యక్షులు సైకం మల్లేశ్వరరావు తెలిపారు. ఆదివారం తాడేపల్లి సీతానగరం మత్స్యకారుల ర్యాంపులో సైకం మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో కందూరు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకార కార్మికులందరూ వారి కుటుంబాలు క్షేమంగా ఉండాలని 30 ఏళ్ల నుండి నాగుల మీరా జెండా ఎత్తటం కుందూరు జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. చేపలు సమృద్ధిగా పడాలని, మత్స్యకారులందరూ సంతోషంగా ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోలకంపాడు ఫిషర్ మ్యాన్ సొసైటీ కార్యదర్శి బాబు, డైరెక్టర్ సురేష్, సైకం సురేష్, నడకుదురు లక్ష్మయ్య, కొప్పనాతి శంకర్రావు, నడకుదురు శ్రీనివాస్, నడకుదిటి రామారాజు, కొదమల శివయ్య, కోప్పనాతి సాంబయ్య, దాడి అంజి, ప్రసంగి వెంకటేశ్వరరావు, సైకం దుర్గారావు, కొక్కిలిగడ్డ మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వ్యాధిని తొలి దశలో గుర్తిస్తే నివారణ సులభం

ప్రజాశక్తి - తుళ్లూరు

వ్యాధిని ప్రథమ దశలోనే గుర్తిస్తే చికిత్స సులభమవుతుందని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ వైద్యులు చెప్పారు.రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరులో ఎస్ జి టి అండ్ జె వి ఆర్ జూనియర్ కళాశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటైంది.శిబిరంలో గుండె,మెదడు,నరాల శస్త్ర చికిత్స,ఎముకలు, కీళు ్ళ,అలెర్జీ,ఊపిరి తిత్తులు,గైనకాలజీ,సాంక్రమిక వ్యాధుల వైద్య నిపుణులు అకీఫ్ మహమ్మద్ బేగ్, అరుణ్ కుమార్,భరత్ చంద్ర,డాక్టర్ బాల భాస్కర్,డాక్టర్ భాను తేజ,డాక్టర్ నీరేన్ రావెల రోగులకు వైద్య సేవలు అందించారు.వైద్య పరీక్షలు నిర్వహించారు.ఉచితంగా మందులు అందజేశారు.వైద్య శిబిరం నిర్వహణకు తుళ్లూరు ఎడ్యుకేషనల్ సొసైటీ కరస్పాండెంట్ జొన్నలగడ్డ శంకరరావు,బండ్ల పట్టాభి రామయ్య, గ్రామ పెద్దలు సహకారం అందించారు.రోగులకు అన్నదానం చేశారు.

తెనాలి తహశీల్దార్‌గా కెవి గోపాలకృష్ణ

ప్రజాశక్తి - తెనాలి

తెనాలి తహసిల్దార్ గా కెవి గోపాలకష్ణ బాధ్యతలు చేపట్టనున్నారు. ఎన్నికల సమయంలో వివిధ ప్రాంతాలకు ఎన్నికల విధులు నిర్వహించేందుకు బదిలీలపై వెళ్లిన తహసిల్దార్లను ప్రభుత్వం తిరిగి నియమిస్తుంది. దీనిలో భాగంగా జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి శనివారం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం కె వెంకట గోపాలకష్ణను తెనాలి తాసిల్దారుగా నియమించారు. గోపాలకష్ణ గతంలో చేబ్రోలు తహసీల్దారుగా పనిచేశారు. ఎన్నికల సమయంలో ఆయన సూళ్లూరుపేట తహసిల్దార్ గా బదిలీ అయ్యారు. ఎన్నికలకు ముందు తెనాలిలో తాసిల్దారుగా పనిచేసిన కె రవిబాబును కూడా ఎన్నికల సమయంలో బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఆ స్థానంలో నెల్లూరు నుంచి తెనాలి తహశీల్దార్ గా వచ్చిన శ్రీనివాసరెడ్డి కూడా తాజాగా తిరిగి నెల్లూరు వెళ్లారు. ఆయన స్థానంలో గోపాలకష్ణ రానున్నారు. పని చేసిన ప్రతిచోట సమర్ధవతమైన అధికారిగా గోపాలకష్ణ గుర్తింపు పొందారు. రెండు మూడు రోజులలో ఆయన తెనాలిలో బాధ్యతలు చేపట్టనున్నారు.

రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం విద్య కమిటీ కన్వీనర్ గేరా మోహన్‌రావు

ప్రజాశక్తి - నకరికల్లు : రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టియు) వత్తి విద్య కమిటీ కన్వీనర్ గేరా మోహన్‌రావు ఎంపికైనట్లు నకరికల్లు మండల అధ్యక్షులు నాగేశ్వరావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 26 సంవత్సరాలుగా రాష్ట్ర ఉపాధ్యాయ సంఘంలో మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో అనేక బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. విద్యార్థుల పాఠశాల స్థాయిలో విద్యను నేర్చుకోవడం ద్వారా జీవితంలో స్థిర పడ వచ్చు అన్నారు. గేరా మోహన్‌రావును పల్నాడు జిల్లా ఎస్టీయూ అధ్యక్షులు ఎల్వి రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రాజిత్ యాదవ్ మండల నాయకులు రాంబాబు, పరమేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు మస్తాన్‌వలి, వెంకట్రావు, సుందర్రావు, గౌస్ అభినందనలు తెలిపారు.

పేదలు, అనాధలకు ఆహార పొట్లాల పంపిణీ

ప్రజాశక్తి -పొన్నూరు

పొన్నూరు పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్, షేక్ కరిముల్లా 75 వ జయంతి కార్యక్రమాన్ని పొన్నూరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, కుటుంబ సభ్యులు ,బంధుమిత్రులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని45 సంవత్సరాలకు పైగా జర్నలిస్టుగా విధులు నిర్వహించి అనేక ప్రజా సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు కరిముల్లా ఎనలేని కషి చేశారన్నారు.జర్నలిస్టు గానే కాకుండా నాటక రంగంలో తనదంటూ ప్రత్యేక శైలిని ప్రదర్శించి ప్రేక్షకుల మన్నలను పొందారన్నారు. మరోవైపు చిత్రకారుడిగా దేశ, రాష్ట్ర సందేశాత్మక చిత్రాలను గీసి పలువురి అధికారులు, నాయకుల ప్రశంసలు అందుకున్నారు. కరిముల్లా జయంతి సందర్భంగా తనయుడు 21వ వార్డు మాజీ కౌన్సిలర్ షేక్ షేక్ నయీమ్ భాష పట్టణంలోని అనాధ శరణాలయాల్లో, నిడుబ్రోలు రైల్వే స్టేషన్ లోని అనాధలకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. తండ్రి షేక్ కరీముల్లా జ్ఞాపకార్థం ప్రతి ఏడాది పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నయుంబాషా తెలిపారు.

ఉరేసుకుని ఆత్మహత్య

ప్రజాశక్తి-ఈపూరు

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పెదకొండాయపాలెం గ్రామంలో ఆదివారం జరిగింది.సేకరించిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన సురభి నాగ జెన్నయ్య (38) ఇంట్లో వారందరు చర్చికి వెళ్ళగా మద్యం మత్తులో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు మృతదేహాన్ని ఈపూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు కలరు.

ఆకస్మికంగా వాహనాల తనిఖీ చేసిన ఎస్‌పి

286 వాహనాలను సీజ్ - 98 వాహనాలకు రూ.5.26 లక్షల జరిమానా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు పశ్చిమ నియోజకవర్గం పరిధిలో జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్ ఆదివారం సాయంత్రం పలు ప్రాంతాలను సందర్శించి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. స్థానిక పోలీస్ అధికారులు, స్పెషల్ ఎన్ఫోర్స్ మెంట్ అధికారులు వాహనాలను తనిఖీలు చేశారు. మద్యం తాగి వాహనలు నడపడం, బైక్ రేసింగ్, సరియైన పత్రాలు లేని వాహనాలను, ఈవ్ టీజింగ్,త్రిబుల్ డ్రైవింగ్... పబ్లిక్ కి ఇబ్బంది కలిగించే వాహనాలను సీజ్ చేశారు. 286 వాహనాలను సీజ్ చేసినట్టు ఎస్‌పి తెలిపారు. 98 వాహనాలకు రూ.5.26 లక్షల చలానాల రూపంలో జరిమానా విధించారు. మద్యం సేవించి నడుపుతున్న 12 వాహనాలను సీజ్ చేశారు. మాదకద్రవ్యాలు , గంజాయి రహిత జిల్లాగా ఏర్పాటు చేయాలనే సంకల్పంతో మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపినట్లు ఎస్‌పి తెలిపారు. సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 8.30 గంటల వరకు 10 ముఖ్య మైన ప్రాంతాల్లో సుమారు 150 మంది పోలీసు సిబ్బందితో ప్రత్యేక నాఖా బంది కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌పి స్వయంగా పర్యటించి వాహనాలను తనిఖీలు నిర్వహించే అధికారులకి సిబ్బందికి పలు సూచనలు చేశారు. యువత ర్యాష్ డ్రైవింగ్, లైసెన్స్ లేకుండా వాహనాలను నడిపే వారు, డ్రంకన్ డ్రైవ్ వాహనాలను ట్రిపుల్ డ్రైవింగ్, నెంబర్ ప్లేట్లు లేని వాహనాలను తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా మైనర్లు వాహనాలను నడిపితే తలిదండ్రులదే బాధ్యత అని ఎస్‌పి తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. సరియైన పత్రాలు లేని ఆటోలు, కార్లు,టూ వీలర్ వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి సతీష్‌కుమార్ తెలిపారు. ద్విచక్ర వాహనం నడిపే వారు తప్పక హెల్మెట్ ధరించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ మైనర్లు వాహనాలను నడుప రాదని, అవిదంగా మైనర్లు వాహనాలను నడిపితే తల్లిదండ్రులదే బాధ్యత అని, రోడ్డు భద్రత ,ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అక్రమ మద్యం,క్రయ విక్రయాలకు పాల్పడిన, గుంటూరు జిల్లాను మాదకద్రవ్యాల రహిత గంజాయి రహిత జిల్లాగా ఏర్పాటు చేయడమే లక్ష్యంగా అందరమూ కలిసి పని చేయాలని అధికారులను ఆదేశించారు ఎఆర్ అదనపు ఎస్‌పి హనుమంతు, వెస్ట్ డి ఎస్ పి మహేష్, సౌత్ సబ్ డివిజన్ డి ఎస్ పి మహబూబ్ బాషా, ఎఆర్ డి ఎస్ పి శాంత కుమార్ స్పెషల్ బ్రాంచ్ సిఐలు ఆనంద్, వెంకట ప్రసాద్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

ప్రజాశక్తి - తాడేపల్లి

.తాడేపల్లి లోని సీతానగరం శ్రీరామ కృష్ణ హై స్కూల్ 1987 బ్యాచ్ పదవతరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఉల్లాసంగా జరిగింది. ప్రాతూరు రోడ్డు లోని ఓ పంక్షన్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో నాడు పాఠశాల లో చదువుకున్న దాదాపు 60 మంది విద్యార్థులు హాజరయ్యారు. రాష్ట్రంలో పలుప్రాంతాల్లో స్థిరపడిన విద్యార్థులు ఈ కార్యక్ర మానికి తరలివచ్చారు. నాడు తమకు విద్యాబుద్దులు నేర్పిన గురువులను తలచుకున్నారు.37 సంవత్సరాల క్రిందటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఉల్లాసంగా ఆడి పాడారు. ఆట పాటల్లో గెలుపొందివారికి బహుమతులు అందజేశారు. ప్రతి సంవత్సరం అందరం కలుసుకొని ఇలాంటి కార్యక్రమం నిర్వహించాలని తీర్మానించారు. పూర్వవిద్యార్థులు దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, చందు,మస్తాన్, రఘు, మధు, ఉదయలక్ష్మి తదితరుల ఆద్వర్యంలో జరిగింది.

శాంతి ద్వారానే సుస్థిర అభివృద్ధి

ఎమ్మెల్సీ కెస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

శాంతి సాధించడం ద్వారానే సుస్థిర అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. ఆదివారం గుంటూరులో జరిగిన కార్గిల్ విజయ రజతోత్సవ చిత్ర ప్రదర్శన ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన్‌లో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ఈ చిత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరులైన జవాన్లకు, కార్గిల్‌యుద్ధంలో పాల్గొన్న వారికి లక్ష్మణరావు నివాళులర్పిం చారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మొదటి, రెండు ప్రపంచ యుద్ధాలు మొదలుకుని ప్రస్తుతం ఇజ్రాయెల్-పాలస్తీనా, రష్యా-ఉక్రెయిన్ యుద్ధాల వరకూ మూలకారణానికి పరిష్కారం లేకుండా అపారమైన విధ్వంసం, మానవ నష్టం జరుగుతున్నాయన్నారు. దేశాలు యుద్ధాల కంటే చర్చల ద్వారా సమయస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ది హిందూ దినపత్రిక సీనియర్ కరస్పాండెంట్ ఎం. సాంబశివరావు సిబిసి డైరెక్టర్ పి.రత్నాకర్, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డైరెక్టర్ డాక్టర్ జిడి హల్లెకెరి, సిబిసి సీనియర్ ఎట శ్రీదేవి నాయర్, సిబిసి క్షేత్ర ప్రచార అధికారి ఆర్.రమేష్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు. అనంతరం వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు

ఆర్థరైటిస్‌పై 'అవగాహన' ఆధ్వర్యంలో ఆరోగ్య సభ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అరండల్‌పేటలోని అవగాహన కార్యాల యంలో ఆదివారం నిర్వహించిన ఆరోగ్య సభలో రుమటాలజిస్ట్ డాక్టర్ మమత పాల్గొని ఆర్థరైటిస్ సమస్యపై అవగాహన కల్పించారు. రుమటాయిడ్ ఆర్థరైటిస్ చిన్న, పెద్ద బేదం లేకుండా ఎవరిలోనైనా వచ్చే అవకాశం ఉందని, ఈ సమస్యకు గురైనప్పుడు వాపులు కనపడతాయని, ఈ సమస్య ఉన్నవారికి ఉదయం లేచిన వెంటనే కీళ్లు, జాయింట్స్ పట్టుకుపోయినట్టుగా నొప్పిగా అనిపిస్తుందన్నారు. నెమ్మదిగా పనిలో పడిన కొద్దీ ఆనొప్పి తీవ్రత తగ్గుతున్నట్లుగా అనిపిస్తుందని వివరించారు. ఈ రుమ టాయిడ్ ఆర్థరైటిస్ సమస్యను మందుల వాడకం ద్వారా తగ్గించవచ్చన్నారు. ఈ సమస్య ఎక్కువగా ధూమపానం, మద్యపానం, ఒత్తిడి, జంక్ ఫుడ్స్, పొల్యూషన్ వల్ల తలెత్తుతాయని, కొందరిలో జన్యుపరంగా కూడా వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఈ సమస్యతో బాధపడే వారిలో ఇమ్యూన్ సిస్టం, వ్యాధికారకాలపై పోరాటం పోయి, వ్యతిరేకంగా పనిచేయడం వల్ల మనిషిని అనేక ఇబ్బందులకు గురి చేసే చేస్తుందన్నారు. ఈ సమస్యతో బాధపడేవారు మాంసాహారం ఎక్కువ మోతాదులో తీసుకోకూడదని చెప్పారు. తర్వాత ఆస్టియో ఆర్థరైటిస్ గురించి తెలియజేస్తూ ఈ సమస్య వయసు రీత్యా, ఎక్కువ బరువులు మోసే వారికి, అధిక ఒత్తిడికి గురయ్యే వారికి, జన్యుపరంగా కూడా తలెత్తుతుందన్నారు. ఈసమస్యతో బాధపడే వారికి చేతివేళ్ళు , గిలకలు, మోకాళ్లు వాపునకు గురి అవుతాయని, ఈ సమస్య సాధారణంగా పెద్ద వయసు వారిలో కనపడుతుం దన్నారు. ఆస్టియో ఆర్థరైటిస్‌కు గురైన వారిలో చిన్న చిన్న కారణాలతో కూడా ప్రాక్చర్లు అవుతుంటాయని, ఎముకలలో కాల్షియం తగ్గుతుందని, ఈ సమస్యకు మందుల ద్వారానే కాకుండా ఫిజియోథెరపీ, వ్యాయా మాలు చేయడం ద్వారా ఉపశమనం ఉంటుందన్నారు. గౌట్ సమస్య గురించి మాట్లాడుతూ మన రక్తంలోని యూరిక్ యాసిడ్ స్థాయి పెరగడం వల్ల వస్తుందన్నారు. ముఖ్యంగా మూత్రపిండ సమస్య ఉన్నవారిలో ఈ సమస్య ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ సమస్యతో బాధపడేవారు సీఫుడ్, రెడ్ మీట్, షుగర్ కలిపిన పానీయాలు తీసుకోకూడదన్నారు. ఈసమస్య వల్ల జాయింట్స్‌లో క్రిస్టల్స్ ఏర్పడి నొప్పిని కలిగిస్తాయన్నారు. ఈ సమస్యను మందుల ద్వారా తగ్గించవచ్చన్నారు. అనంతరం అవగాహన సభ్యులు డాక్టర్ మమతను సన్మానించారు. ఈఆరోగ్య సభకు టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, విశ్రాంత ప్రభుత్వ వైద్యులు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. .

మాట్లాడుతున్న డాక్టర్ మమత

ట్రాక్టర్‌ను ఢీకొన్న ట్రావెలర్స్ బస్సు

ప్రజాశక్తి - నకరికల్లు

అతివేగంతో వస్తున్న ఆరెంజ్ ట్రావెల్స్ బస్సు మట్టి ట్రాక్టర్ ను డీ కొట్టిన సంఘటన ఆదివారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. ఎస్సై నాగేంద్రరావు తెలిపిన వివరాల ప్రకారం చెన్నై నుంచి హైదరాబాద్ వెళుతున్న ఆరెంజ్ ట్రావెల్స్ బస్సు అడ్డరోడ్డు వద్ద గల బాలాజీ డైరీ వద్ద మట్టిలోడుతో వెళున్న ట్రాక్టర్ ను ఢీ కొట్టి పంట పొలాల్లోని కాలువలోకి దూసుకు వెళ్ళింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బస్సు డ్రైవర్ నిజాం ఖాన్‌కు (50) తీవ్ర గాయాలవ్వడంతో నరసరావుపేట లోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాదులోని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ బత్తుల చిన్న సుబ్బయ్య ఫిర్యాదు వరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగేంద్రరావు తెలిపారు. ప్రయాణ సమయంలో బస్సులో 25 మంది ప్యాసింజర్‌లు ఉన్నారు.

వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆదివారం గుంటూరులో నిర్వహించారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదించారు. నెల్లూరు జిల్లా పడమటి గూడురులో ఉన్న సర్వే నెంబర్ 1988లో 46 ఎకరాల భూమిని పింగాణి పరిశ్రమ కోసం రాష్ట్ర సంక్షేమ సంఘానికి రిజిస్టర్ చేయటం జరిగిందని, అనివార్య కారణాలతో నిధులు సమీకరించటంలో ఆలస్యం అయినందున ప్రభుత్వం సదరు స్థలాన్ని రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేశారని, కావున తిరిగి పింగాణి పరిశ్రమ కోసం కేటాయించాలని కోరారు. గత ప్రభుత్వం కులవృత్తుల కోసం జిఒ 1076, దాని ఉప జీఒల ద్వారా కులవృత్తులకు అన్యాయం జరగకుండా రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాల్లో ఆ జీవోలను అమలు చేయాలని కోరుతూ తీర్మానం చేశారు. కుమ్మర కులవృత్తి దారులున్న ప్రదేశాలు గుర్తించి, కామన్ ఫెసిలిటీస్ సెంటర్స్ ఏర్పాటు చేయాలని, కులవృత్తి చేసుకునే 50 సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్ మంజూరు చేయాలని తదితర తీర్మానాలు ఆమోదించారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు పద్మ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బెజవాడ ఆదిశేషయ్య, అసోసియేట్ అధ్యక్షులు ఓబుల పత్తి, 13 జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

సూర్యనారాయణకు సంపూర్ణ మద్దతు

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా కార్యాలయంలో ఆదివారం జిల్లా కార్యవర్గ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా మాట్లాడుతూ ఇటీవల జరిగిన పరిణామాలను దష్టిలో పెట్టుకుని రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణకు జిల్లా కార్యవర్గం పూర్తిస్థాయిలో మద్దతు ప్రకటిస్తూ, రాష్ట్ర సంఘం నుండి బహిష్కరణకు గురైన ఆస్కారరావు విషయంలో రాష్ట్ర సంఘం తీసుకున్న నిర్ణయం సరైనదని తీర్మానం చేశారు.రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణకు మద్దతుగా జిల్లాలో అతి త్వరలో ర్యాలీ నిర్వహిస్తామని జిల్లా అధ్యక్షులు చాంద్‌భాషా తెలిపారు.అలాగే ఆగస్టులో ఓపిఎస్ పునరుద్ధరించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం వద్ద ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. సంఘంలో చీలిక లేమీ లేదని బహిష్కరణకు గురైన వారు ఉద్యోగులను అయోమయానికి గురి చేస్తున్నారని అన్నారు. సమావేశంలో నగర అధ్యక్షులు నాగేశ్వరరావు, నగర కార్యదర్శి సాంబశివారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు హుస్సేన్ ఖాన్, నాయకులు హరిక్రిష్ణ, పెదరత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు రోడ్డులో కాసు బ్రహ్మనంద విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తదితరులు

మాజీ సిఎం కాసు బ్రహ్మానందరెడ్డికి నివాళి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కాసు బ్రహ్మానందరెడ్డి 115వ జయంతి సందర్భంగా పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం పల్నాడు రోడ్డులోని కాశి బ్రహ్మానందరెడ్డి విగ్రహానికి గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పూలమాలవేసి నివాళు లర్పించారు. మహేష్‌రెడ్డి మాట్లాడుతూ సిఎంగా బ్రహ్మానందరెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల గుండెలలో నిలిచారని చెప్పారు. కార్యక్రమంలో నరసరావుపేట కళావేదిక అధ్యక్షులు పొన్నపాటి ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిసిసి అధ్యక్షులు గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్ ఆధ్వర్యంలో కాసు బ్రహ్మానందరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. సుధాకర్ మాట్లాడుతూ కాసు బ్రహ్మానందరెడ్డి ఉమ్మడి ఆంధ్రరాష్ట్రానికి 7 ఏళ్లకు పైగా ముఖ్యమంత్రిగా పని చేసి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపారన్నారు. కార్యక్రమంలో సీదా కృష్ణ, బీసీసెల్ పూర్ణ, సత్యం, దేవానంద్, కొండలు, ప్రేమ్, శివ పాల్గొన్నారు.

కొత్తపాలెం సర్పంచ్ సుబ్బారావు మృతి

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని కొత్తపాలెం సర్పంచ్ మొలమంటి వెంకట సుబ్బారావు (58) మెదడు సంబంధిత సమస్యతో ఆదివారం మృతి చెందారు. అనారోగ్యంగా ఉందంటూ శుక్రవారం సాయంత్రం తన నివాసంలో ఒక్కసారిగా కుప్పకూలడంతో కుటుంబ సభ్యులు గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు మృతి చెందారు. సుబ్బారావుకు భార్య వెంకటనర్సమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సోమవారం మధ్యాహ్నం కొత్తపాలెంలో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబీకులు తెలిపారు.

హామీల నుంచి తప్పించుకునే ఎత్తుగడ

వైసిపిజిల్లా అధ్యక్షులు మందపాటి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఎలా తప్పించుకోవాలన్న అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యయనం చేస్తున్నారని వైసిపి జిల్లా అధ్యక్షులు మందపాటి శేషగిరిరావు అన్నారు. ఆదివారం వైసిపి గుంటూరు తూర్పు నియోజకవర్గం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ హామీలను ప్రకటించిన టిడిపి ఇప్పుడు ఎన్నికల హామీలను అమలు చేయడం సాధ్యం కాదని చేతులు ఎత్తడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని పక్కదోవ పట్టించేందుకు వైసిపి కార్యకర్తలు,నాయకులపై దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. దళితులపై దాడులు జరుగుతున్నా టిడిపిలోనే దళిత నాయకులు నోరుపెదపడం లేదన్నారు. ఆయన ఇప్పుడు టిడిపిలో చేరి వైఎస్ జగన్‌పై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

ప్రతి చిన్నారిలోనూ ఏదో ఒక ప్రతిభ

- సెల్‌ఫోన్లను దూరంగా ఉంచి ప్రోత్సహిస్తే ఉన్నత స్థాయికి
- సృజనాత్మకతను ప్రోత్సహించాల్సింది తల్లిదండ్రులు, ఉపాధ్యాయులే
- ముగిసిన ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ 'పల్నాడు స్టూడెంట్, యూత్ ఫెస్ట్'
- వివిధ విభాగాల్లో విజేతలకు బహుమతులు ప్రదానం

బహుమతులు అందుకుంటున్న విజేతలు

నృత్యప్రదర్శన, ఏకపాత్రాభినయ ప్రదర్శల్లో విద్యార్థులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ప్రతి చిన్నారిలోనూ ఏదో ఒక ప్రతిభ ఉంటుందని, దాన్ని వెలికి తీసేలా వారిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని వక్తలు అన్నారు. పిల్లల్ని సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచి వారి సృజనాత్మకతను ప్రదర్శించేలా చూడాలన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), భారత ప్రజాతంత్ర యువజన సంఘం (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో స్థానిక ఎన్ఆర్‌టి సెంటర్‌లోని గ్రాండ్ వెంకటేష్ కన్వెన్షన్ హాలులో రెండ్రోజుల పాటు నిర్వహించిన పల్నాడు యూత్‌ఫెస్ట్ నియోజకవర్గస్థాయి పోటీలు శనివారం సాయంత్రం ముగిశాయి. అనంతరం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన లోక్‌సత్తా రాష్ట్ర నాయకులు, ప్రముఖ న్యాయవాది ఎం.భానుప్రసాద్ మాట్లాడుతూ పిల్లల్లోని ప్రతిభాపాటవాలను ప్రదర్శించేందుకు ఇలాంటి ప్రత్యేక కార్యక్రమాన్ని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ రూపొందించడం, అందుకు యుటిఎఫ్ సహకరించడం అభినందనీయమన్నారు. పాటల పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించిన ఆళ్ల నాగతులసి శ్యామల మాట్లాడుతూ ఆత్మవిశ్వాసంతో చేసే ఏ పనీ విఫలం కాదన్నారు. సెల్‌ఫోన్లను పక్కన పెట్టి నిబద్ధతతో లక్ష్యం వైపు వెళ్లాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రజానాట్య మండలి సీనియర్ నాయకులు ఎన్.కాళిదాసు మాట్లాడుతూ చిన్నారుల ప్రదర్శనలు బాగున్నాయని, మరింతగా శిక్షణ, సాధన తోడైతే అద్భుతాలు చేస్తారని అన్నారు. దేశ భవిష్యత్ వారి చేతుల్లోనే ఉందని, వారే వారి భవితకు మార్గాలను పరచుకోవాలని సూచించారు. డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కార్యదర్శులు ఆంజనేయరాజు, కె.సాయికుమార్ మాట్లాడుతూ ఫెస్ట్ నిర్వహణకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో పల్నాడులోని అన్ని ప్రాంతాల్లోనూ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం కార్యక్రమానికి ఆర్గనైజర్‌గా వ్యవహరించిన బిఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి ఎవి.శివయ్యను సత్కరించారు.

విజేతలు..

క్లాసికల్, జానపద నృత్యం, పాటల పోటీలు, మార్షల్ ఆర్ట్స్, ఫ్యాన్సీ డ్రస్, ఏకపాత్రాభినయం తదితర అంశాల్లో జూనియర్, సీనియర్ విభాగాలుగా పోటీలు నిర్వహించారు. చిలకలూరిపేట నియోజవకవర్గంలోని చిలకలూరిపేట పట్టణం, మండలం, నాదెండ్ల, యాడ్లపాడు ప్రాంతాల నుండి విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. పాటల పోటీల్లో మొదటి, రెండు స్థానాల్లో చైతన్య లిటిల్స్ పాఠశాలకు చెందిన డి.సురేఖ, హర్షిణి గెలుపొందారు. పసుమర్రు పాఠశాలకు చెందిన సాద్విక్, యడ్లపాడులోని నారాయణ పాఠశాలకు చెందిన హర్ష కన్సోలేషన్ బహుమతి పొందారు. ఫోక్ డ్యాన్స్ జూనియర్ విభాగం (సోలో)లో మొదటి బహుమతి చైతన్య లిటిల్ స్కూల్‌కు చెందిన కావ్యశ్రీ, రెండో బహుమతిని మాస్టర్ మైండ్స్‌కు చెందిన ఆయాష్ గెలుపొందారు. గ్రూప్ డ్యాన్స్‌లో గణపవరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మొదటి బహుమతి సాధించగా రెండో బహుమతిని చిలకలూరిపేట నజారాం మున్సిపల్ స్కూల్ విద్యార్థులు దక్కించుకున్నారు. కూచిపూడి నాట్యంలో చిలకలూరిపేటలోని గ్రీన్ వ్యాలి స్కూల్‌కు చెందిన మౌనిక మొదటి స్థానంలో నిలిచారు. సీనియర్ క్లాసిక్ డాన్స్‌లో గ్రీన్‌వ్యాలి స్కూల్, మార్షల్ ఆర్ట్స్‌లో భాష్యం విద్యార్థులు మొదటి బహుమతులు సాధించారు. న్యాయ నిర్ణేతలుగా టి.కోటేశ్వరరావు, బి.భార్గవి, ఎ.నాగతులసి శ్యామల, కె.వి.మంగరావు వ్యవహరించారు. ఏపూరి గోపాలరావు, డి.బుచ్చిబాబు, పి.వెంకటేశ్వర్లు, కె.రోశయ్య, జె.రాజశేఖర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో కోటిమందికి అన్నదానం, కోటిమొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకున్నామని, సేవాభావం కలిగిన దాతలు ఇందుకు సహకరించాలని 316 మల్టిపుల్ కౌన్సిల్ చైర్పర్సన్ పిఎంజెఎఫ్ లయన్ దామచర్ల శ్రీశాంతి కోరారు. సత్తెనపల్లి పట్టణంలోని గోశాల కళ్యాణ మండపంలో సత్తెనపల్లి పట్టణ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం ఆదివారం నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా ఎన్.పొన్నెకంటి కిషోర్‌కుమార్, కార్యదర్శిగా బి.వీరాంజనేయలు, కోశాధికారిగా బి.రోశయ్య ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారానికి ముఖ్యఅతిథిగా లయన్ దామచర్ల శ్రీశాంతి హాజరై ప్రమాణస్వీకారం చేయించారు. 316 హెచ్ విడిజి2 పిఎంజెఎఫ్ లయన్ ఆర్.లక్ష్మీనారాయణ నూతన సభ్యులకు సభ్యత్వం కల్పించి క్లబ్‌లోకి సాదరంగా ఆహ్వానించారు. విశిష్ట అతిథిగా హాజరైన సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ కె.షమీమ్మ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ చేపట్టే ఏ సేవా కార్యక్రమానికైనా తమవంతు సహకారం ఉంటుందన్నారు. ఎంఇఒ ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం శుభదిన్ అనే పేరుతో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, లయన్స్ క్లబ్ ఎంచుకున్న కోటిమందికి అన్నదానం కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు చేయడం ద్వారా ఇటు విద్యార్థులకు ప్రోత్సాహకంగానూ అటు క్లబ్ లక్ష్యసాధనకు ఉపయోగంగానూ ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా ఒక నిరుపేద మహిళకు వెట్ గ్రైండర్, హాస్టల్‌లో వుంటూ విద్యనుభ్యసిస్తున్న 27 మంది పేద విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్, పెన్సిల్, స్కేల్, ఎరేసర్, షార్పనర్ లతో కూడిన కిట్‌లు, 11 మందికి దుప్పట్లు, 10 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్ వైపి మురళీకృష్ణ, లయన్ కంబాల వెంకటేశ్వరరావు, సభ్యులు మంచికంటి వెంకటేశ్వరరావు, తవిటి భావనారాయణ, కోట వెంకటేశ్వర్లు, కె.విష్ణువర్ధన్‌రావు, పి.రామకోటయ్య, తోట చినసాంబశివయ్య, తోట పద్మ, తిరుమల సాంబశివరావు, కె.గురుప్రసాద్, పి.చంద్రయ్య, కొండవీటిరాజు, కె.రాజశేఖర్, జి.మహేశ్వరరావు, గ్రంధిశీల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సులభమైన పరీక్షల ద్వారా కామెర్ల వ్యాధి నిర్ధారణ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : సులభమైన పరీక్షల ద్వారా కామెర్ల వ్యాధి నిర్ధారించవచ్చని నర్సరావుపేట శకుంతల హాస్పిటల్స్ అధినేత డాక్టర్ ఐలా శ్రీనివాసరావు అన్నారు. సత్తెనపల్లి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్యులకు కంటిన్యూ మెడికల్ ఎడ్యుకేషన్ పై అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు.వరల్డ్ హైపటెటిస్ డే సందర్భంగా శకుంతల హాస్పిటల్స్, అధినేత డాక్టర్ ఐలా శ్రీనివాసరావు కామెర్లు వ్యాధి నిర్ధారణ చికిత్స గురించి వైద్యులకు వివరించారు. శ్రీవిద్య హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తడవర్తి శ్రీవిద్య మాట్లాడుతూ మలబద్ధకం వాటీలో రకాలు, చికిత్స విధానం గురించి వివరించారు. సదస్సులో సత్తెనపల్లి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ జెట్టి శ్రీనివాసరావు, కార్యదర్శి డాక్టర్ జి.శ్రీధర్ పాల్గొన్నారు.

అన్నప్రసాద పథకానికి విరాళాలు

ప్రజాశక్తి - అమరావతి : అమరావతిలోని శ్రీబాల చాముండేశ్వరి సమేత శ్రీ అమరేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిత్యాన్న ప్రసాద పథకానికి ఆదివారం రూ. 40,021లు భక్తులు సమర్పించినట్లు దేవస్థానం సహాయ కమిషనర్ , కార్యనిర్వహణాధికారి వేమూరి గోపీ ఆదివారం తెలిపారు. నిడమానూరుకు చెంఇన పమిడి భారత లక్ష్మి కుటుంబ సభ్యులు పమిడి శ్రీనివాసరావు జ్ఞాపకార్థం రూ.10,116 లు సమర్పించినట్లు చెప్పారు.

మోసకారి బడ్జెట్లో రాష్ట్రానికి, రైతాంగానికి జరిగిన అన్యాయంపై నిరసన

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కేంద్ర బడ్జెట్ లో రాష్ట్రానికి, రైతాంగానికి జరిగిన అన్యాయంపై రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం జాతీయ రహదారిపై ప్రజా సంఘాల నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతులను దగ్ధం చేసి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి, రైతాంగానికి తీవ్ర నిరాశ ఎదురైందని అన్నారు. రాజధాని నిర్మాణానికి 15 వేల కోట్లు అప్పుల రూపంలో కాకుండా గ్రాంట్ రూపంలో నిధులు కేటాయింపులు కేటాయించారు కానీ, రైతాంగానికి బడ్జెట్ కేటాయించింది ఏమీ లేదని ఆయన విమర్శించారు. ఆంధ్ర రాష్ట్రానికి విభజన హామీలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా కేంద్ర మంత్రులు ప్రచారం ఆర్భాటం తప్ప, నిధులు మంజూరు చేసింది ఏమి లేదని విమర్శించారు. ఈ బడ్జెట్ దేశ ప్రజలకు మేలు చేకూర్చే ది కాదని, పేదలపై భారాలు వేసే బడ్జెట్ అని ధ్వజమెత్తారు. రాష్ట్రానికి, కేంద్ర బడ్జెట్లో తీరని మోసం జరిగిందని మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కేంద్రం బాధ్యతని తెలిపినప్పటికీ, దానికి నిధులు కేటాయింపు బడ్జెట్లో పేర్కొనలేదన్నారు. విశాఖ స్టీల్ ప్రభుత్వ రంగంలోనే ఉంచాలని, విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ పై కూడా కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల వెనుగుబడిన ప్రాంతాల అభివద్ధికి ఈ బడ్జెట్ లో పైసా కేటాయించక పోవడం దుర్మార్గమన్నారు. బీహార్ కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి 58 వేల కోట్లు గ్రాంట్లు రూపంలో సాధించిందని, అదే రీతిలో రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రంతో పోరాడి నిధులు సాధించాలని కోరారు. పార్టీలకతీతంగా రాష్ట్రానికి జరిగిన అన్యాయం పై, నిధులు రాబట్టేందుకు, హక్కుల కోసం ఉమ్మడిగా పోరాటానికి అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కష్ణ, సిఐటియు తాడేపల్లి మండల సహాయ కార్యదర్శి కంచర్ల సాంబశివరావు, నాయకులు నాగ పోగు విజయరాజు, కంచర్ల జేమ్స్, గుడిసె శ్రీనివాస రావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అప్పలరాజు, ఎస్.కె గన్, బుర్ర రాజు, లటికే కోటేశ్వరరావు, గుడిసె ప్రభుదాస్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వడ్డేశ్వరం వద్ద

ప్రజాశక్తి-తాడేపల్లి

కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ తాడేపల్లి బోసుబొమ్మ సెంటర్‌లో రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బడ్జెట్ ప్రతులను తగుల బెట్టారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు, ప్రజాసంఘాల నాయ కులు ఎం.శ్రీనివాసరెడ్డి, వి.దుర్గారావు, డి.విజయబాబు, డివి భాస్కరరెడ్డి, ఎస్.ముత్యాలరావు, బూరుగ వెంకటేశ్వర్లు, డి.దశరథరామిరెడ్డి, డి.యోహాన్, వి.శాస్త్రి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

కేంద్ర బడ్జెట్లో వ్యవసాయ రంగానికి నిధులు కేటాయింపులు తగ్గించడాన్ని నిరసిస్తూ ఆదివారం చెంచుపేట ఉమేష్ చంద్ర విగ్రహం వద్ద ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు కొల్లిపర బాబూ ప్రసాద్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బీహార్‌కు భారీగా నిధులు కేటాయించి ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం చేయడంపై మండిపడ్డారు. వ్యవసాయ రంగాన్ని కార్పొ రేట్లకు అప్పగించేందుకు మోడీ ప్రభుత్వం రంగం సిద్ధం చేసుకుందని అన్నారు. కార్మిక, కర్షక ఐక్యత ద్వారానే వ్యవ సాయ రంగాన్ని కాపాడుకోగలమని అన్నారు. అనంతరం బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు షేక్ హుస్సేన్ వలి, పి జోనేహ్, చుక్కపల్లి శేషగిరిరావు, మహిళా సంఘం నాయకులు ఎన్ రాజ్యలక్ష్మి, వై ఈశ్వరి, చంద్రకళ, ములకా శివకుమారి, ఎం అనూష పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకాకాని : పెదకాకాని సిపిఎం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆంధ్ర ప్రదేశ్ కి అన్యాయం జరిగిందని నిరసిస్తూ బడ్జెట్ పత్రాలను తగులబెట్టారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై నేతాజీ, మండల కార్యదర్శి నన్నపనేని, జిల్లా కమిటీ సభ్యులు బైరగాని శ్రీనివాసరావు, నాయకులు ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్లో ప్రవేశపెట్టిన బడ్జెట్లో వ్యవసాయ రంగాన్ని నష్టం చేకూర్చే విధంగా నిధులు తగ్గించినందుకు నిరసనగా వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం రైతు సంఘాల ఆధ్వర్యంలో దుగ్గిరాలలోని ముర్తుజా నగర్ జెండ చెట్టు వద్ద బడ్జెట్ పత్రాల నకలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈమని అప్పారావు మాట్లాడుతూ దేశంలో 30 కోట్ల మంది ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తుండగా కేవలం 0.5శాతం నిధులు మాత్రమే కేటాయించారని నిరసన వ్యక్తం చేశారు. పురుగుమందులు ఎరువుల ధరలపై సబ్సిడీ పై కోత విధించారని ఉపాధి హామీ నిధులు తగ్గించి ఆ పథకాన్ని నిర్వీర్యం చేసేటందుకు కుట్ర పన్ను తున్నారన్నారు .బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో జట్టి బాలరాజు వై స్టాలిన్ వై బ్రహ్మేశ్వర రావు బి అమ్మిరెడ్డి డి వెంకట సుబ్బారావు దేవేంద్ర ఎం కోటేశ్వరావు ఏ అంజయ్య శివ నాగేశ్వరమ్మ గౌరీ లక్ష్మి బిక్షాలు మురళి పాల్గొన్నారు.

దుగ్గిరాలలో

పెదకాకానిలో

తెనాలిలో

ఫిరంగిపురంలో

ప్రజాశక్తి - ఫిరంగిపురం

కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి రైతాంగానికి జరిగిన అన్యాయంపై పొనుగుపాడు గ్రామంలో రైతుసంఘం, సిఐటియు ఆధ్వర్యంలో రామాలయం సెంటర్లో బడ్జెట్ ప్రతులను దహనం చేయటం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జి. బాలకృష్ణ , సిఐటియు మండల కార్యదర్శి మస్తాన్వలి మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి రైతాంగానికి తీవ్ర నష్టం జరిగిందని, రాజధాని నిర్మాణానికి 15 వేల కోట్లు అప్పుల రూపంలో కాకుండా గ్రాండ్ రూపంలో నిధులు కేటాయించాలని విభజన హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిహెచ్ శ్రీనివాసరావు, కే కోటేశ్వరావు, నరసింహారావు, రాము, నాగేశ్వరరావు, హనుమంతరావు యం. వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన బాలసుబ్రమణ్యం

అభినందన సభలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

గతంలో ప్రభుత్వ పాఠశాలలో చదివిన ఎంతోమంది విద్యార్థులు విదేశాలలో స్థిరపడ్డారని ప్రభుత్వ పాఠశాలలు ఉంటేనే గాని పేద విద్యార్థులు చదువుకోగలగుతారని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. ఆదివారం స్థానిక సాయి అన్నపూర్ణలయంలో ఎంఈఓ దివి బాలసుబ్రమణ్యం పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో వారు మాట్లాడారు. రాజకీయాలకతీతంగా14 సంవత్సరాలుగా పెదనందిపాడు మండల విద్యాశాఖ అధికారిగా పని చేసి ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన బాలసుబ్రమణ్యం ఈ ప్రాంత ప్రజల మన్ననలను పొందారన్నారు. జీవో 117 రద్దు చేసేందుకు మంత్రి లోకేష్ హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేసే కార్యక్రమంలో గతంలో మాదిరిగా ఒకే చోట ఐదు తరగతులుకు ఐదుగురు ఉపాధ్యాయులను ఏర్పాటు చేసి ఒక కంప్యూటర్ ఉపాధ్యాయిని ఏర్పాటు చేసి అందులో 150 మంది విద్యార్థులు ఉండేటట్టు ఏర్పాటు చేస్తే ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి చెందుతాయి అన్నారు. బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణ మాట్లాడుతూ సన్మాన గ్రహీత బాలసుబ్రమణ్యం మొదటినుండి క్రమశిక్షణతో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారని కొనియాడారు. అభినందన సభకు వందలాదిమంది ఉపాధ్యాయులు హాజరవటమే దీనికి నిదర్శనం అన్నారు. పలువురు ప్రముఖుల ప్రసంగాలు అనంతరం బాల సుబ్రహ్మణ్యం వెంకటరమణ దంపతులను లక్ష్మణరావుతో పాటు పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన అధికారులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు సురేంద్రబాబు, మనీషాసాయి, భాగ్యలక్ష్మి, వెంకటేశ్వరరావు, జయదీప్, పలు మండలాలకు చెందిన విద్యాశాఖ అధికారులు, ఏపీ పాలెం సోసైటీ అధ్యక్షుడు కూరేటి భూషయ్య, దాసరి శేషగిరిరావు పోపూరి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు. తొలుత అశోక పాఠశాల స్కౌట్ విద్యార్థులు బ్యాండ్ మేళంతో విద్యాశాఖ అధికారులకు స్వాగతం పలికారు.

బాలసుబ్రమణ్యం దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

యోగా ఆత్మ విశ్వాసాన్ని పెంచుతుంది

ప్రజాశక్తి-గుంటూరు

చిన్న వయస్సు నుండి యోగా సాధన చేయటం ప్రస్తుత పరిస్థితుల్లో ఎంత అవసరం అని, యోగ మనిషిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. ఆదివారం అరండల్‌పేటలోని కెనడీ స్కూల్లో జరిగిన యోగా పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే నసీర్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా మానసిక ఒత్తిడి తగ్గిస్తుందని, ఆయుష్షుని పెంచుతుందన్నారు. నగరంలో పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడా స్థలాలు లేక శారీరక ధారుఢ్యం లేకుండా పోతుందన్నారు. యోగా వల్ల మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పారు. అనంతరం విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందచేశారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ శ్రీకాంత్, రిటైర్డ్ డిఎస్‌డిఎ వెంకటేశ్వరరావు, జె.శ్రీనివాసరావు, యోగా శిక్షకులు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారంలో రాజీపడను

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు పశ్చిమ నియోజకవర్గములోని 44 వ డివిజన్ ఆంజనేయపేట, సాకేతపురంలోని సీసీ రోడ్లు.సైడ్ డ్రైనేజీలకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆదివారం శంఖుస్థాపన చేసారు. ఈ సందర్భముగా స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసు కొని వాటిని పరిష్కారించాలని అధికారులను సూచించారు. పారిశుధ్యం విషయంలో రాజి పడే ప్రసక్తే లేదని, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, తీసిన వ్యర్థాలను అదే రోజు తొలగించాలని సూచించారు. ప్రజలకు తాను ఎప్పుడు అందుబాటులోనే ఉంటానని, ప్రజా సమస్యలను ఎప్పుడయ్యిన నేరుగా తన దృష్టికే తీసుకొనిరావాలని స్థానిక ప్రజలకు కోరారు. యర్రకుల శ్రీనివాసరావు, కన్నసాని విజయ్ కుమార్. కన్నసాని బాజీ,మద్దిరాల మ్యాని, ఈరంటి వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కొరిటెపాడు వాకింగ్ ట్రాక్ పరిశీలన

44వ డివిజన్ లోని వాకింగ్ ట్రాక్ ను గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పరిశీలించారు. ఈ సందర్భముగా వాకర్స్‌తో ముచ్చటించి, పార్కులోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాకింగ్ ట్రాకర్ల అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని గళ్ళా మాధవి హామీనిచ్చారు.

ఎల్‌విఆర్ క్లబ్‌లో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వికాస్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎల్‌వి ఆర్ క్లబ్‌లో మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. దాదాపు 300 మంది వైద్యపరీక్షలు చేయించుకున్నారని ఆస్పత్రి అధినేత గళ్ళా రామచంద్ర రావు తెలిపారు. ఈ క్యాంపులో కార్డియా లజిస్ట్ డాక్టర్ సుధాకర్ కనుమూరి, వ్యాస్కులర్ సర్జన్ డాక్టర్ సురేంద్ర నాగులపాటి , నెఫ్రాలజీస్టు డాక్టర్ నిహారిక జొన్నలగడ్డ , గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రావణి రాయిపూడి, జనరల్ సర్జరీ డాక్టర్ శివ రంజిత్ వాక, ఆర్థోపెడిక్స్ అండ్ జాయింట్ రిప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ పవన్ కొమినేని, సర్జికల్ అంకాలజి డాక్టర్ చందన వేమూరి, డెంటిస్ట్ డాక్టర్ శాలిని వైద్య సేవలు అందించారని తెలియచేశారు. క్యాంపులో క్లబ్ అధ్యక్షులు మైనేని బ్రహ్మేశ్వం రావు, ఉపాధ్యక్షులు. వణుకూరి శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి. యాగంటి దుర్గారావు, కోశాధికారి. యేల్చూరి వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శి. కొండ్రగుంట శ్రీనివాసరావు, వికాస్ హాస్పిటల్స్ సీఈవో. నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జీవిత చరిత్రపై రేపు నత్యరూపక ప్రదర్శన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అందరివాడని ఆక్స్‌ఫర్డ్ ఎడ్యుకేషన్ సొసైటీ డైరెక్టర్ పల్నాడు బాలోత్సవాల అధ్యక్షులు సిహెచ్ రాజగోపాల్ రెడ్డి (రాజారెడ్డి) అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలోని కొత్త రఘురామయ్య కళాశాలలో ఆదివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవిత కృషిని వివరించే 'సంఘం – శరణం – గచ్ఛామి' నత్య రూప నాటక ప్రదర్శన కరపత్రాన్ని ప్రజానాట్య మండలి కళాకారులు, ప్రజా సంఘాలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30న సాయంత్రం 6 గంటలకు నరసరావుపేట పట్టణం ప్రకాష్ నగర్ భవన చంద్ర టౌన్ హాల్‌లో హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రదర్శించనున్న సంఘం – శరణం – గచ్ఛామి అనే నత్యం నాటక ప్రదర్శనను పట్టణ ప్రజల అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. దళిత, బహుజన, అభ్యుదయ మేధావులు ఈ నాటకం రూపొందించడంలో తమ వంతు కీలక పాత్ర పోషించారన్నారు. పల్నాడు బాలోత్సవాల కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు మాట్లాడుతూ హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటివరకు 600 పైగా నిర్వహించిన ప్రదర్శనలు ఎంతో విజయవంతమయ్యాయన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రజా సంఘాల నాయకులు గోదా జాన్‌పాల్, భూదాల బాబురావు మాట్లాడుతూ భారతదేశానికి దిశా నిర్దేశం చేసే దిక్సూచి అత్యున్నతమైన రాజ్యాంగాన్ని అందించిన బాబాసాహెబ్ అంబేద్కర్ జీవిత చరిత్రపై ప్రదర్శిస్తున్న నాటకాన్ని ప్రతిఒక్కరూ వీక్షించాలని పిలుపునిచ్చారు.

కరపత్రాలు ఆవిష్కరించిన పల్నాడు బాలోత్సవాల కమిటీ, ప్రజాసంఘాలు

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రాజగోపాల్ రెడ్డి తదితరులు

40 వేల మందికి శివశక్తి ఫౌండేషన్ శుక్లాల ఆపరేషన్లు

ప్రజాశక్తి - వినుకొండ

ఆపరేషన్లకు వెళ్తున్న వారితో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు దంపతులు

శివశక్తి ఫౌండేషన్ ద్వారా శంకర నేత్రాలయం సహకారంతో నియోజకవర్గంలోని ఇప్పటికే 40 వేల మంది అవ్వాతాతలకు కంటి శుక్లం ఆపరేషన్లు చేయించామని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. ఈనెల 14వ తేదీ వినుకొండలో జరిగిన మెగా కంటి వైద్య శిబిరంలో శంకర కంటి వైద్య నిపుణుల బృందం కంటి పరీక్షలు చేసి సుమారు 1900 మంది వృద్ధులకు శుక్ల ఆపరేషన్లు అవసరమైన నిర్ధారించగా ఆదివారం రెండు బస్సుల్లో సుమారు 100 మందిని శివశక్తి ఫౌండేషన్ ద్వారా శంకర కంటి ఆసుపత్రి పెద్దకాకానికి తరలించారు. దీనిలో భాగంగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, లీలావతి దంపతులు అవ్వ తాతలను ఆప్యాయంగా పలకరించి పరామర్శించారు. గతంలో ఒక కన్ను ఆపరేషన్ చేయించుకుని రెండవ కంటి శుక్లాం ఆపరేషన్కు వెళ్లేవారిని గత అనుభవాలను అడిగి తెలుసుకుని కొత్తగా వెళ్తున్న వారికి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 25 ఏళ్లగా శివశక్తి ఫౌండేషన్ ప్రజలకు సేవలందిస్తోందన్నారు. అన్ని అవయవాల కంటే కంటి చూపు ప్రధానమని, నేత్రదానం గొప్పదని భావించి శివశక్తి ఫౌండేషన్ వృద్ధులకు ఉచితంగా కంటి శుక్లాల ఆపరేషన్లు చేయిస్తోందని తెలిపారు. తనభార్య, ఫౌండేషన్ చైర్మన్ లీలావతి అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. శివశక్తి ఫౌండేషన్ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పివి సురేష్ బాబు పాల్గొన్నారు.

సిపిఎం నాయకులు అజయ్‌కుమార్ తల్లి మల్లమ్మదేవి నేత్రదానం

ప్రజాశక్తి - వినుకొండ

కంచుమాటి మల్లమ్మ దేవి (86) ఆమె రెండు కళ్లను గుంటూరు జిల్లా పెదకాకానిలోని శంకర్ కంటి ఆస్పత్రి ఐ బ్యాంకుకు దానం చేసినట్లు అమ్మ నేత్ర అవయవ శరీర దాన ప్రోత్సాహక సంఘం పల్నాడు జిల్లా కో-ఆర్డినేటర్ సంద్రపాటి చలపతిరావు ఆదివారం తెలిపారు. శావల్యాపురం మండలం వేల్పూరుకు చెందిన సిపిఎం గుంటూరు జిల్లా కమిటీ సభ్యులు కంచుమాటి అజయ్‌కుమార్ తల్లి మల్లమ్మదేవి కొంతకాలంగా ఆరోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. వారి కుటుంబ సభ్యుల అనుమతి మేరకు శంకర కంటి ఆసుపత్రి ఐ బ్యాంకు సిబ్బంది కళ్లను సేకరించారు. 45 ఏళ్లుగా వామపక్ష భావాలు కలిగిన ఆ కుటుంబంలోని వ్యక్తి మరణానంతరమూ ప్రజలకు ఉపయోగపడేలా ఉండడం ఆదర్శనీయమ న్నారు. మల్లమ్మదేవి కళ్లను ఐ బ్యాంకులో భద్రపరిచిన కంటి చూపు లేని వారికి ఆపరేషన్ ద్వారా అమర్చి వారికి చూపు తెప్పిస్తారని, ఎవరైనా మరణించిన తర్వాత దానం చేయవలసిన వారు మరణించిన ఐదు గంటలలోపు ఐస్ బాక్స్‌లో ఉంచితే ఎనిమిది గంటలలోపు నేత్రదాన ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. మల్లమదేవి కార్నియా సేకరణకు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు హర్షిత, వైద్య సిబ్బంది హాజరయ్యారు. కంచుమాటి మల్లమ్మ కుటుంబ సభ్యులు శేషగిరిరావు, అజయ్‌కుమార్, మహాలక్ష్మమ్మ, అరుణ కుమారిని పలువురు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

విత్తనాలు, మందుల కొనుగోలులో రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - క్రోసూరు

ఖరీఫ్ సాగు రైతులు నాశిరకం విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల పట్ల చాలా అప్రమత్తంగా ఉండాలని కామన్ మ్యాన్ అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ (క్యాప్) సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన పరుస్తున్నారు. ఈ సందర్భంగా క్యాప్ సంస్థ తరపున అధ్యక్షుడు వడ్లమూడి బాలకృష్ణ మాట్లాడుతూ రైతులు విత్తనాలు, మందులు కొనే క్రమంలో కంపెనీల ఉచ్చులో పడొద్దన్నారు. లైసెన్సు ఉన్న వాటినే కొనాలని, బిల్లులు జాగ్రత్త చేసుకోవాలని సూచించారు. తప్పకుండా పంటల బీమా చేయించుకోవాలన్నారు. అంతే కాకుండా వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులు కూడా నకిలీ కంపెనీ యజమానులపై ఉక్కుపాదం మోపినప్పుడే రైతులు మోసానికి గురవ్వకుండా ఉంటారని చెప్పారు.

అన్న క్యాంటీన్‌లు మూసి పేదల కడుపు కొట్టిన వైసిపి

నరసరావుపేటలో అన్న క్యాంటీన్ల పనుల్ని పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పేదల కడుపు నింపే అన్న క్యాంటీన్ మూసివేసి పేదల కడుపు కొట్టిన వైసిపికి రాష్ట్ర ప్రజల సరైన బుద్ధి చెప్పారని ఎమ్మెల్యే అరవిందబాబు విమర్శించారు. నరసరావుపేట పట్టణంలో నిర్మిస్తున్న అన్న క్యాంటీన్ భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆదివారం పరిశీలించారు. అదే సమయంలో పట్టణంలో ప్రారంభం కానున్న మిగిలిన అన్న క్యాంటీన్ల పనుల్ని పరిశీలించి, ఆకలి తీర్చడానికి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. గతంలో పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా అన్న క్యాంటీన్లు పని చేశాయని, వైసిపి అధికారంలోకి వచ్చాక కక్ష పూరితంగా అన్న క్యాంటీన్లు రద్దు చేశారని అన్నారు. మరోవైపు అన్న క్యాంటీన్ భవనాలను అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చారని దుయ్యబట్టారు. పేదలకు అన్నం పెట్టడంపై కూడా జగన్ రెడ్డి కక్ష చూపారన్నారు. కూలి కోసం పట్టణాలకు వచ్చిన పేదలకు కేవలం రూ.5తో కడుపు నింపడాన్ని కూడా వైసిపి నేతలు హేళన చేయడం వారి దుర్మార్గానికి నిదర్శనం అన్నారు. కూటమి ప్రభుత్వం పేదలకు ఎప్పుడూ అండగా నిలుస్తుందని, అన్న క్యాంటీన్ల ప్రారంభంతో మరోసారి నిరూపించబోతున్నామని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జి.అంకమ్మ చౌదరి, సంజీవరావు, మోహన్‌రావు, సాంబయ్య, క్రాంతి పాల్గొన్నారు.

భరతమాత ముద్దు బిడ్డల పేర్లతో నూతన పథకాలు

ప్రజలకు ఏం కావాలో రాష్ట్రాభివృద్ధికి ఏం చేయాలో కూటమి ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తోందని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు వైసిపి పెట్టిన పేర్లను తొలగించి భరత మాత ముద్దు బిడ్డల పేర్లతో నూతన పథకాలు ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. నాడు-నేడు అంటూ గత ప్రభుత్వం విద్యా వ్యవస్థను రాజకీయం చేసిందని ధ్వజమెత్తారు. పిల్లలు చదువుకునే పుస్తకాలపై ఆర్థిక నేరస్తుడు జగన్మోహన్‌రెడ్డి తీసుకున్న మూర్ఖపు నిర్ణయాలను కూటమి ప్రభుత్వం ప్రక్షాళన చేస్తుందన్నారు. దేశంకోసం జీవితాలను త్యాగం చేసిన అబ్దుల్ కలాం, ఆకలి తీర్చిన డొక్కా సీతమ్మ, సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి మహనీయులతో పథకాలు అందించబోతున్నట్లు తెలిపారు. అమ్మఒడి పథకాన్ని 'తల్లికి వందనం'గా, విద్యా కానుకకు 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర'గా, గోరుముద్ద పథకానికి డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనంగా, నాడు-నేడును 'మన బడి- మన భవిష్యత్తు'గా, స్వేచ్ఛ పథకాన్ని' బాలికా రక్ష పథకం'గా, ఆణి ముత్యాల పేరును 'అబ్దుల్ కలాం ప్రతిభా పురస్కారం'గా మార్చుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు.

యానిమేటర్లపై వేధింపులు ఆపాలి : సిఐటియు

ప్రజాశక్తి - అమరావతి

మండలంలోని యానిమేటర్లపై అధికార పార్టీ నాయకుల వేధింపులు ఆపాలని సిఐటియు మండల కార్యదర్శి బి.సూరిబాబు డిమాండ్ చేశారు. డ్వాక్రా గ్రూపులు సభ్యులకు బ్యాంకుల ద్వారా లోన్ ఇప్పించటం, చెల్లించేలా చూడటం ప్రభుత్వ పథకాలను తెలియపరచటం నిత్యం గ్రామంలో ఉంటూ గ్రూపు సభ్యులుకి సేవ చేస్తున్న యానిమేటరర్లు ప్రభుత్వ పథకాలు ప్రజలకి తెలియపరచటంలో ప్రభుత్వాలకు కీలకంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ బహిరంగ సభలకు జన సమీకరణ కావాలంటే ముందుగా వారి సేవలను ఉపయోగించుకుంటారని అన్నారు. ఎన్నో సంవత్సరాల నుండి డ్వాక్రా గ్రూపు సభ్యుల ఆర్థికంగా ఎదుగుదలకు, చైతన్యానికి కృషి చేస్తుంటారని, ప్రభుత్వానికి డ్వాక్రా గ్రూపు సభ్యులకు అనుసంధానంగా యానిమేటర్లు పనిచేస్తుంటారని చెప్పారు. అలాంటి వారిని నూతనంగా వచ్చిన ప్రభుత్వం అధికార పార్టీ నాయకులు బెదిరించడం, స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని ఒత్తిడి తేవడం దారుణమని అన్నారు. 'మీ గ్రామంలో ఉన్న అధికార పార్టీ నాయకులు మాకు ఫోన్ చేసి తొలగించమని చెప్తున్నార'ని వెలుగు అధికారులు యానిమేట్లకు ఫోన్ చేస్తున్నారని, విధుల నుండి వైదొలగాలంటున్నారని, ఇది సరైన పద్ధతి కాదని సూరిబాబు అన్నారు. ఎన్నో సంవత్సరాల నుండి డ్వాక్రా గ్రూపుల మీద ఆధారపడి పనిచేస్తున్న యానిమేటర్లు పొట్ట కొట్టొద్దని, వారి కుటుంబాలకు అన్యాయం చేయొద్దని కోరారు. అధికార పార్టీ నాయకులు చేసే దూకుడు చర్యలు మానుకోకుంటే భవిష్యత్ కాలంలో ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

శకుంతల జనరల్, గ్యాస్ట్రో లివర్ కేర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వరల్డ్ హెపటైటీస్ డే సందర్భంగా శకుంతల జనరల్ మరియు గ్యాస్ట్రో లివర్ కేర్ ఆధ్వర్యంలో నకరికల్లు మండలం గుత్తికొండలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 70 మందికి డాక్టర్ పి.నరేంద్రనాథ్ దత్తు, డాక్టర్ ఐలా శ్రీనివాస్ గ్యాస్, బిపి,షుగర్, జలుబు, దగ్గు, జ్వరం,థైరాయిడ్ వంటి సాధారణ వ్యాధులతో జీర్ణకోశ వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ ఐలా శ్రీనివాస్ మాట్లాడుతూ హైపటటీస్ వ్యాధి కారణాలను, వ్యాధిని కలిగించే వైరస్ రకాలు, టాక్సిన్స్ గురించి వివరించారు. జాండిస్ ప్రధానంగా పరిసరాల అపరిశుభ్రత, కలుషిత నిటి ద్వారా, పరిశుభ్రంగా లేని తినుబండారాలు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు తీసుకోవడం ద్వారా వ్యాపిస్తుందని తెలిపారు. హెపటైటిస్ వైరస్ ఎ, బి, సి, డి, ఇ 5 రకాలుగా ఉంటాయన్నారు. చర్మం పసుపు రంగులోకి మారుతుంద న్నారు. ఈ వ్యాధితో ఏడాదికి లక్షలకు పైగా లివర్ సిరోసిస్, లివర్ క్యాన్సర్ ద్వారా మరణిస్తున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికలు చెబుతున్నాయన్నారు. హెపటైటిస్ లివర్‌పై ప్రభావం చూపుతుందని, కాలేయ కణజాలం యొక్క వాపును హెపటైటిస్ అంటారన్నారు. ఈ వ్యాధివల్ల చర్మం పసుపు రంగులోకి మారడం, ఆకలి లేకపోవడం, వాంతులు, కడుపునొప్పి లేదా అతిసారం వంటి లక్షణాలను చూపుతోందని, హెపటైటిస్ మానవ శరీరంలోని ముఖ్యమైన భాగమైన ఆలయాన్ని ప్రభావితం చేస్తుందని మానవ శరీరం యొక్క జీవన క్రియను ప్రభావితం చేసే వివిధ క్లిష్టమైన విధులను నిర్వహిస్తుందన్నారు. రోగి కోలుకొనే సమయంలో క్రమం తప్పకుండా కాలేయ పనితీరును పరీక్షించుకోవాలన్నారు. ఒకరి వ్యక్తిగత వస్తువులు మరొకరు వినియోగించరాదన్నారు.

ఏళ్ల తరబడి అద్దె భవనాల్లోనే హాస్టళ్లు

- అరకొర వసతులతో విద్యార్థుల ఇక్కట్లు
- అమలుకు నోచుకోని మెనూ
- ఆర్ఓ ప్లాంట్, ఇన్వర్టర్లు లేక ఇబ్బందులు

ప్రజాశక్తి - పొన్నూరు

నిరుపేద విద్యార్థులకు ఉన్నత స్థాయి చదువులు ఆర్థిక భారంతో మధ్యలో ఆగిపోకుండా 2008 సంవత్సరంలో అప్పటి టిడిపి ప్రభుత్వం పాలిటెక్నిక్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్, డిప్లమో విద్యార్థులకు కాలేజ్ హాస్టల్స్‌ను నెలకొల్పింది. అప్పటికప్పుడు ఏర్పాటు చేసిన కాలేజీ హాస్టల్స్‌ను అరకొర సౌకర్యాలతో అద్దె భవనాల్లో ఏర్పాటు చేశారు. గత 16 సంవత్సరాల కాలం నుంచి ఇప్పటివరకు బాలుర, బాలికల బిసి కాలేజీ హాస్టల్స్‌ను పలు అద్దె భవనాల్లో మార్చారు. బాలుర బిసి కాలేజీ హాస్టల్‌ను గత రెండు సంవత్సరాల నుండి సరైన వసతులు ఉన్న హాస్టల్ భవనం లేకపోవడంతో, ప్రభుత్వ బిసి బాలుర వసతి గృహంలో దీనిని నిర్వహిస్తున్నారు. బాలుర బిసి కాలేజీ హాస్టల్‌లో ప్రస్తుతం వంద మంది విద్యార్థులకు గాను 53 మంది చేరారు. కాలేజీ హాస్టల్ విద్యార్థులకు సరైన వసతులు సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. బాలికల బీసీ కాలేజ్ హాస్టల్‌ను ఆరో వార్డు విద్యానగర్ లో అద్దె భవనంలోనే నడుపుతున్నారు. ప్రస్తుతం ఈ హాస్టల్లో 40 మంది విద్యార్థినీలు చేరారు. ఈ కాలేజీ హాస్టల్స్‌లో ఆర్ఓ ప్లాంట్లు లేకపోవడంతో అనాధరైజ్డ్ వాటర్ ప్లాంట్లలో నీటిని అందిస్తున్నారు. వర్షాకాలంలో చీటికిమాటికి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో చదువుకోవటానికి ఇన్వర్టర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యార్థులు కోరుతున్నారు. బాలుర బీసీ కాలేజీ హాస్టల్ విద్యార్థులకు తగిన మరుగుదొడ్లు కూడా లేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ప్రభుత్వం కాలేజ్ హాస్టల్స్ కు ఫర్నిచర్ చేసినప్పటికీ స్థలం లేకపోవడంతో వాటిని వాడకుండా మూలపడే వేశారు. లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన ఆ ఫర్నిచర్ నిరుపయోగంగా పడి ఉంది. గత ప్రభుత్వంలో రూ.1400 ఉన్న మెస్ ఛార్జీ లను రూ.1600 రూపాయలు పెంచింది. నాలుగు నెలల మెస్ చార్జీల బిల్లులు చెల్లించాల్సి ఉంది. విద్యార్థులకు ఐదు నెలల కాస్మోటిక్ నగదు ఖాతాల్లో పడలేదు. గత ప్రభుత్వం మెనూ కూడా మార్పు చేసింది. పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా చార్జీలు పెరుగుతాయని సంతోషపడ్డారు. అయితే గత ప్రభుత్వం మార్పు చేసిన మెనూ విద్యార్థులకు అమలు జరగడం లేదు. మార్పు చేసిన మెనూతో నెలకు రూ.2500 నుంచి రూ.3000 ఖర్చు అవుతుందని హెచ్ డబ్ల్యుఒలు వాపోతున్నారు.

బిసి బాలుర హాస్టల్లో నడుపుతున్న బాలుర కాలేజ్ హాస్టల్

పొన్నూరు విద్యానగర్‌లో అద్దె భవనంలో నడుస్తున్న బాలికల కాలేజ్ హాస్టల్

సకాలంలో మెస్ ఛార్జీలు ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో హెచ్ డబ్ల్యుఓలు అప్పుల ఊబిలో కూరుకు పోయారు. మెస్ చార్జీలు, విద్యార్థులకు కాస్మోటిక్స్ చార్జీలు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వ కాలేజీ హాస్టల్స్‌లో అడ్మిషన్లు పెరుగుతున్న క్రమంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం స్థలం సేకరించి సొంత భవనాల నిర్మాణం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

శ్రీనివాసరెడ్డికి ఉత్తమ సాహితీ పురస్కారం

ప్రజాశక్తి - చేబ్రోలు

కొత్త రెడ్డిపాలెం కొండవీటి కమిటీ హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డి రాసిన ‘ ఇక్కడ మనుషులు అదశ్యమయ్యారు’ అనే వచన కవితకి ఉత్తమ సాహితీ పురస్కారం వచ్చిందని ఆయన ఆదిఆవరం తెలిపారు. ఈ కవితను తెలుగు సాహితి వనం పుస్తకంలో ప్రచురించారని తెలిపారు. హైదరాబాదు రవీంద్రబారతిలో తెలంగాణా బాషా సాంస్కృతిక శాఖ ఆద్వర్యంలో పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాసరెడ్డికి పురస్కారం అందజేశారు. సభలో యండమూరి వీరేంద్రనాథ్, ఏనుగు నరసింహారెడ్డి, అంపశయ్య నవీన్ మరియు శాంతి కృష్ణ సమక్షంలో ఉత్తమ పురస్కారాన్ని అందుకోవటం సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. గతంలో వాగ్దేవి సాహితీ వేదిక , కవితల పోటీలలో, మరియు అభ్యుదయ రచయితల సంఘం నిర్వహించిన కవితల పోటీలలో ఉత్తమ సాహితీ పురస్కారాలు ఈయనకు లభించాయి. పాఠశాల కరస్పాండెంట్ ఉపాధ్యాయులు మరియు కమిటీ సభ్యులు శ్రీనివాసరెడ్డికి అభినందనలు తెలిపారు.

రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ డి శారద

మితాహారం, వ్యాయామం విధిగా అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - తెనాలి

శారద సర్వీసెస్ సొసైటీ ఆధ్వర్యంలో రూరల్ గ్రామం బుర్రిపాలెం ఎస్ భవన్లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రతినెల చివరి ఆదివారం డి 3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. దానిలో భాగంగానే డాక్టర్ డి శారద ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు బిపి, షుగర్, వివిధ రకాల రక్త పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శారద మాట్లాడుతూ ఏదైనా అనారోగ్యం సంభవించిన తరువాత చికిత్స కంటే, ఆ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం అవసరమన్నారు. శారీరిక రుగ్మతలు సంభవించినప్పుడు కచ్చితంగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. సమతుల్య ఆహారంతో పాటు, శారీరక వ్యాయామం ఉండాలన్నారు. ప్రతినెల నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రపంచ ప్రకృతి పరిరక్షణా దినోత్సవం

ప్రజాశక్తి - పెదనందిపాడు

ప్రకృతిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపైనా ఉందని, ధరణి పచ్చని అడవులతో ఆరోగ్యంగా ఉంటేనే జీవరాసికి మనుగడ, భవిష్యత్ సజావుగా సాగుతుందని ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిలర్ జి మోహనరావు పేర్కొన్నారు. ఆదివారం ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా పెదనందిపాడు శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మానవుల అనాలోచిత చర్యల వల్ల ప్రకృతికి వాటిల్లుతున్న అనర్థాల గురించి ప్రజలకు తెలియజేసేందుకు జూలై 28న ప్రకృతి పరిరక్షణ దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలందరూ ప్రకృతి పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకులు పి సుభాషిని, విశ్రాంత ఉపాధ్యాయులు గారపాటి రమేష్, కె మంజుల, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి వైద్యం అందిస్తున్న ప్రముఖ గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ రఘురామ్

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక కన్యకపరమేశ్వరి ఆలయంలో ఆదివారం పిల్లల ఉచిత వైద్య శిబిరం జరిగింది. పట్టణ ఆర్య వైశ్య సంఘం ఆద్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో న్యూ లైఫ్ చిల్డ్రన్ హాస్పిటల్ యాజమాన్యం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెనాలి ఆర్య వైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు అచ్యుత సాంబశివరావు తెలిపారు. గత 19 ఏళ్లగా నిర్వహిస్తున్న వైద్య శిబిరంలో చిన్నారులకు వైద్య సేవలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ కుప్పా రాజశేఖర్ అన్నారు. ఆహార, ఎదుగుదల లోపాలు కారణంగా చిన్నారులు గుండె జబ్బులకు గురౌతారని విజయవాడ నుంచి వచ్చిన ప్రముఖ చిన్న పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ పి రఘురామ్ అన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో పాటు అధునాతన వైద్య పరికారలతో గుండె శస్త్ర చికిత్సలు సులువుగా నిర్వహించవచ్చని పేర్కొన్నారు. డాక్టర్ కుప్పా రాధిక రాజశేఖర్, డాక్టర్ గారపాటి అఖిల్, డాక్టర్ కెటిఎస్ శ్రీనివాసరావు 200 మంది చిన్నారులకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో మాలేపాటి తిరుమలేశ్వర రావు, వి శివ సుధాకర్, ఎం హేమంత్ కుమార్, బి రామ్మోహన రావు, జి రామకోటేశ్వరరావు, పి శ్రీనివాసరావు, ఎం పూర్ణ, పొట్టి శ్రీధర్ పాల్గొన్నారు.

కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్ర బడ్జెట్ : సిపిఐ

ప్రజాశక్తి - మంగళగిరి

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద, అట్టడుగు వర్గాలకు ఆశని పాతంగా, కార్పోరేట్లకు అనుకూలంగా ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ విమ ర్శించారు. మంగళగిరి పట్టణంలో సిపిఐ కార్యాలయంలో ఆదివారం ఏరియా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్లో పెరుగు తున్న ధరలు తగ్గించే విధంగా కాకుండా పెరిగే విధంగా కేటాయింపులు జరిగాయన్నారు. దేశంలో పెరుగు తున్న నిరుద్యోగం అరికట్టేందుకు నిధులు కేటాయించడం లేదన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు కనీస ఊరట కూడా కలిగించే విధంగా బడ్జెట్ సమావేశాల్లో చర్చించలేదన్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి ప్రత్యక్ష నిధులు కేటాయించకుండా ప్రపంచ బ్యాంకు నుండి అప్పులు కేటాయిస్తూ కేంద్రం మోసం చేసిందని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సిపిఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు సిపిఐ నియో జకవర్గ సహాయ కార్యదర్శులు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కంచర్ల కాశయ్య, మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ మిధునేశ్వరరెడ్డి, డాక్టర్ ప్రియాంకను సత్కరిస్తున్న సీనియర్ సిటిజన్స్ బృందం

ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పరీక్షించుకోవాలి

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం ఆదివారం స్థానిక కవిరాజా పార్కులోని సీనియర్ సిటిజన్స్ హాల్లో నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ‘ఊపిరితిత్తులు-శ్వాసకోశ వ్యాధులు’ అంశంపై ప్రముఖ ఊపిరితిత్తుల వైద్య నిపుణులు డాక్టర్ కె.మిధునేశ్వర రెడ్డి ప్రసంగించారు. శ్వాసకోశ సంబంధిత వ్యాధులు సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులకు ఊపిరితిత్తుల సామర్థ్య పరీక్షలు (పిఎఫ్టి) నిర్వహించారు. ఫలితాల ఆధారంగా వారికి పలు సూచనలు చేశారు. అసోసియేషన్ తరపున వైద్యులు డాక్టర్ మిధునేశ్వర రెడ్డి, డాక్టర్ ఎంపి ప్రియాంక దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి పి.పూర్ణ చంద్రరావు, సభ్యులు పాల్గొన్నారు.

గంగానమ్మ గుడిలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి బోసుబొమ్మ సెంటర్‌లో ఇటీవల పునర్నిర్మాణం అయిన గంగానమ్మ గుడిలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చి పొంగళ్లు సమర్పించారు. ఈ కార్యక్రమంలో దొంతిరెడ్డి సాంబిరెడ్డి, మేకా శ్రీధర్‌రెడ్డి, చింతా శ్రీరామ్, పలగాని నాగబాబు, పలగాని గాంధీ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు న్యాయం చేయండి

2వ రోజుకు బెస్ట్‌ఎవైలబుల్ స్కూల్క్ పథకాన్ని పునరుద్ధరించాలని దీక్షలు

ప్రజాశక్తి - మంగళగిరి

బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ మాల మహానాడు ఆధ్వర్యంలో మంగళగిరిలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం నాటికి రెండో రోజు చేరుకున్నాయి. ఈ రిలే దీక్షల నిర్వాహకులు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది గుర్రం రామారావు ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 256 స్కూల్స్ నందు 50 వేలమంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదువుకుంటున్నారని ఈ పథకాన్ని గత వైసిపి ప్రభుత్వం రద్దు చేసింది విమర్శించారు. ఈ పథకం రద్దు వలన పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యారన్నారు. రాష్ట్ర హైకోర్టు దృష్టికి తీసుకెళ్లగా దీని కొనసాగించాలని చెప్పడం,ఆ తర్వాత ప్రభుత్వం సుప్రీంకోర్టు వెళ్ళటం దీనిపై ప్రభుత్వానికి ముట్టికాయలు వేస్తూ కొనసాగించాలని చెప్పిందని ఈ పథకాన్ని అమలు చేస్తూ జీవో ఎంఎస్ 61 రిలీజ్ చేశారని రామారావు తెలిపారు. ఇప్పటికే స్కూల్స్‌లో అడ్మిషన్ జరిగి తరగతుల నిర్వహిస్తున్నారని ఎన్నికల సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విన్నవించగా అధికారంలోకి రాగానే చేస్తామని హామీ ఇచ్చారన్నారు.ఇచ్చిన హామీని రాష్ట్ర

దీక్షలో పాల్గొన్న నాయకులు

ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని గుర్రం రామారావు డిమాండ్ చేశారు. ఈ అవైలబుల్ స్కూల్స్ పథకాన్ని పునరుద్ధరించి విద్యా సంవత్సరం నష్టపోకుండా తక్షణమే పరిపాలన నిర్ణయం తీసుకొని విద్యార్థులకు అడ్మిషన్ కల్పించాలని ఆయన అన్నారు. రెండవ రోజు దీక్షలో గుర్రం రామారావు, దగాని రంజిత్, పిల్లి ఉదయభాస్కర్ కూర్చున్నారు. దీక్షలకు రైల్వే కోడూరు మాల మహానాడు అధ్యక్షురాలు ఎద్దల వెంకటేశ్వరమ్మ, లాం ప్రదీప్ , శ్రీకాంత్, తురిమెళ్ళ రాజు, కొత్తూరు ప్రసాద్, దార్ల గంగరాజు దగాని శ్రీను, దగ్గుపాటి చిట్టిబాబు, గుర్రం ప్రకాష్, పీఎస్ కుమారి. అరుణ తదితరులు మద్దతు తెలియజేశారు.

లావు రత్తయ్యతో పూర్వ విద్యార్థులు

సందడిగా విజ్ఞాన్స్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-గుంటూరు

ఆనాటి జ్ఞాపకాలు, నేటి పరిస్థితుల వరకూ పలకరింపులు, పులకరింతలతో వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల సందడికి వేదికయ్యింది. 1997 నుంచి 2023 విద్యాసంవత్సరంకు చెందిన 26 బ్యాచ్‌ల విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో శనివారం విజ్ఞాన్స్ యూనివర్సిటీలో కలిశారు. రెండున్నర దశాబ్దాల తర్వాత కలిసిన వారంతా సందడిగా, సరదాగా, హుషారుగా గడిపారు. నాటి పాఠాలు బోధించిన అధ్యాపకుల్ని కలుసుకున్నారు. సెల్ఫీలు, గ్రూపు ఫోటోలు దిగారు. యూనివర్సిటీలో చదివిన రోజులను గుర్తు చేసుకుని ప్రతి ఒక్కరూ కొత్త అనుభూతికి లోనయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ మీమీ రంగాల్లో ఇంకా ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. మీరందరు ఇచ్చిన సహకారంతో ప్రస్తుతం విజ్ఞాన్స్ యూనివర్సిటీ ప్రముఖ విద్యాసంస్థలతో పోటీపడే స్థాయిలో నిలబడిందన్నారు. విద్యార్థులు ఎవరైనా బీటెక్‌తోనే ఆగిపోయి ఉంటే ఉన్నత చదువులైన మాస్టర్స్, పీహెచ్‌డీలు చేయాలని సూచించారు.కార్యక్రమంలో విజ్ఞాన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణం, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, విజ్ఞాన్ విద్యా సంస్థల వైస్ చైర్‌పర్సన్ బి.రుద్రమదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లావు రత్తయ్య పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య జన్మదిన వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులందరూ జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహిస్తే తాను ఇంకా ఎక్కువ సంతోషిస్తామన్నారు. విద్యార్థులతో తనకున్న అనుబంధం మాటల్లో వర్ణించలేనిదని, అందుకోసమే ప్రతి సంవత్సరం తన పుట్టినరోజును విద్యార్థుల మధ్య జరుపుకోవడానికి ఇష్టపడతానని పేర్కొన్నారు. సాధారణ ఆలోచనలతో కాకుండా సృజనాత్మకంగా ఆలోచిస్తేనే విజయం సాధించగలరని సూచించారు. అనంతరం పుట్టిన రోజు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ చైర్‌పర్సన్ బి.రుద్రమదేవి, వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, సమన్వయకర్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న రత్తయ్య

రాజధాని నిర్మాణంలో ప్రభుత్వం వాస్తవ దృక్పథంతో ఉండాలి

ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-తాడేపల్లి

రాజధాని అమరావతి నిర్మాణంలో ప్రభుత్వం వాస్తవిక దృక్పథంతో ఉండాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఉద్ఘాటించారు. ఆదివారం తాడేపల్లిలో రాజధాని నిర్మాణం, జరుగుతున్న తీరు, జరగాల్సిన పద్ధతిపై విస్తృత సమావేశం ప్రజాశక్తి కార్యాలయంలో విజ్ఞాన కేంద్రం తాడేపల్లి బాధ్యులు గాదె సుబ్బారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ 2014లో రాష్ట్రం విడిపోయిన తరువాత అధికారంలోకి వచ్చిన టిడిపి శాశ్వత భవనాలు నిర్మించి ఉండాల్సిందన్నారు. 33,500 ఎకరాలు రాజధానికి భూములిచ్చిన రైతులకు పూర్తిగా న్యాయం జరగ లేదని చెప్పారు. శాసనసభ, శాసనమండలి, రాజభవన్, సచివాలయం, ఉద్యోగుల భవనాల నిర్మాణాలు చేపట్టి ఉండాల్సిందని పేర్కొన్నారు. ఈ నిర్మాణాలు కేంద్రం నిధులు ఇవ్వాలని విభజన ఆంధ్రప్రదేశ్ చట్టంలో స్పష్టంగా పేర్కొనబడిందని చెప్పారు. ప్రధాన మంత్రి మోడీ రాజధాని నిర్మాణానికి చెంబుడు నీళ్లు గుప్పెడు మట్టి ఇచ్చి తీవ్ర అన్యాయం చేశారని, ప్రశ్నించాల్సిన అధికార, ప్రతిపక్ష పార్టీలు తమ ప్రయోజనాల కోసం మిన్నకుండిపోయాయని విమర్శించారు. దీని వల్ల ఎపి ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందని చెప్పారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పారిశ్రామీకరణ ద్వారానే అభివృద్ధి చెందుతుందని, హైదరాబాద్, రాష్ట్రంలోని విశాఖపట్నం ఆ విధంగానే అభివృద్ధి జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. విశాఖ అభివృద్ధికి స్టీల్ ప్లాంట్ ప్రముఖ పాత్ర పోషించిందని చెప్పారు. రాష్ట్రం విడిపోయిన తరువాత ఒక్క భారీ పరిశ్రమ కూడా రాష్ట్రానికి అటు టిడిపిగానీ, ఇటు వైసిపిగానీ తీసుకురాలేకపోయాయని చెప్పారు. దీని వల్ల అభివృద్ధి ఎండమావిగానే మారిందన్నారు. ప్రస్తుత సిఎం చంద్రబాబు శ్వేతపత్రాల రూపంలో విడుదల చేసిన వాటిలో గత ప్రభుత్వం చేసిన విధ్వంసాన్ని మాత్రమే చెబుతున్నారని తెలిపారు. తాము రాబోయే ఐదు సంవత్సరాల్లో ఏం చేస్తామో, 2014 నుంచి 2019 వరకు ఏం చేశామో మాత్రం చెప్పడంలేదని విమర్శించారు. స్విస్ ఛాలెంజ్, సింగపూర్ పేర్లతో అభివృద్ధి జరగదని స్పష్టం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన 15 వేల కోట్లు అప్పుగా ఇవ్వడం ఘనంగా చెప్పుకోవడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. అదే సొమ్మును కేంద్రం గ్రాంటుగా ఇస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. గత జగన్ ప్రభుత్వంలో మూడు రాజధానుల పేరుతో ప్రపంచంలో ఎక్కడా లేని నినాదాన్ని ఎత్తుకుని రాష్ట్రానికి అభివృద్ధి లేకుండా చేశారని విమర్శించారు. ఇందులో టిడిపి, వైసిపి దొందూ దొందేనని ఎద్దేవా చేశారు. శాసనమండలి రద్దుకు కూడా తీర్మానం చేసి జగన్ తన ప్రకోపాన్ని ప్రదర్శించారని తెలిపారు. ఇప్పుడు అధికారంలో టిడిపి ప్రభుత్వమైనా పర్మినెంట్ పాలనా భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ రాజధానిలోని హైకోర్టు న్యాయమూర్తులతో సహా ప్రముఖులు విజయవాడ ప్రైవేటు హోటళ్లల్లో ఉండటం ఆందోళనకరమన్నారు. రాజధాని ఉద్యోగులకు, ప్రముఖులకు పక్కా భవనాలు వెంటనే నిర్మించాలని కోరారు. నిర్మాణంలో ఉన్న భవనాలను పూర్తి చేయాలన్నారు. రైతాంగానికి భూములు డెవలప్‌మెంట్ చేసి ప్లాట్లు వెంటనే కేటాయించాలని కోరారు. నష్టపోయిన రైతాంగానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికులకు ఇప్పుడిస్తున్న పింఛను రెట్టింపు చేయాలని కోరారు. రాజధాని నిర్మాణం జరగాలంటే 47 వేల కోట్ల రూపాయలు ప్రస్తుతం అవసరమని చెప్పారు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం రాష్ట్రంలోని టిడిపిపై ఆధారపడి నడుస్తున్న నేపథ్యంలో కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి నిధులు సాధించి రాజధానిని అభివృద్ధి చేయాలని సూచించారు. ముందుగా వక్తలను విజ్ఞాన కేంద్రం బాధ్యులు ఎస్.వెంకట్రావు వేదికపైకి ఆహ్వానించారు.

ఎస్సీ, ఎస్టీల ముసుగులో దోపిడీ

జగన్ పై మాజీ మంత్రి డొక్కా ధ్వజం

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తన పాలనలో ఎస్సీ ఎస్టీలకి ఏదో చేసేస్తున్నట్టుగా ప్రచారం వేసుకొని వేల కోట్ల రూపాయలు దోచుకున్నారని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ ఆరోపించారు. గుంటూరు అరెండల్ పేటలో ఆదివారం సాయంత్రం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్. సి., ఎస్. టి.లని ఒక కార్డుగా వాడుకుని, ప్రేమ వలకపోస్తూ వివిధ స్థాయిల్లో వారికే జగన్ నష్టం చేశారన్నారు. గత ఐదు ఏళ్ల గా పాలన వ్యవస్థ లో ఎన్నో తప్పులు చేసిన జగన్ టిడిపి అధికారంలోకి వచ్చిన నెల రోజులకే రాష్ట్రంలో రాష్ట్రపతి పరిపాలన పెట్టాలంటూ ఢిల్లీలో ధర్నా చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కొత్త ప్రభుత్వానికి కనీస సమయం ఇవ్వకుండా ఏకంగా రాష్ట్రపతి పరిపాలన డిమాండ్ చేయటం దేశంలో ఏ రాష్ట్రంలో ఏ ప్రతిపక్ష పార్టీ చేయలేదన్నారు. వైసిపి హయాంలో గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థ ను తనకి ఉన్న పాలన అనుభవం తో చంద్రబాబు నాయుడు ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కషి చేస్తున్నారని అన్నారు. మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరును పెట్టడం స్వాగతిస్తున్నట్లు తెలిపారు. కొంతమంది వైసీపీ నాయకులు వ్యతిరేకించడం శోచనీయం అన్నారు. ప్రభుత్వ పథకాలన్నీ సమర్థవంతంగా అమలు చేసేందుకు టిడిపి ప్రభుత్వం కషి చేస్తుందన్నారు.

ఉపాధి పనులతో వలసల నివారణ

గతేడాది 86శాతం పనులు పూర్తి - సగటు వేతనం రూ.272

ఉపాధికూలీ బకాయిలు రూ.40 కోట్లు ఆగస్టులో చెల్లిస్తాం - అవినీతిని ఉపేక్షించం

ఉపాధికి సిసి రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం, పండ్లు, పూలతోటల సాగు పనులు

ప్రజాశక్తితో డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వలస కూలీలకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం వరమని డ్వామా పీడీ జి జోసఫ్ కుమార్ తెలిపారు. వలసల నివారణకు ప్రవేశపెట్టిన పథకం గ్రామీణ ప్రాంతాలలో పంట కాల్వల ఆధునీకరణ, గ్రామాలలో పచ్చదనం పెంపొందించేందుకు రోడ్ల వెంట మొక్కలు నాటడం, నీటి కుంటలతో ఉద్యాన పంటల సాగుకు పెద్ద పీట వేస్తున్నామని జిల్లా నీటి నిర్వహణ సంస్థ (డ్వామా) పిడి జి.జోసెఫ్ కుమార్ అన్నారు. పల్నాడు జిల్లాలో 28 మండలాల్లో గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధి పెంపొందించడం ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో వంద రోజులు వేతన ఉపాధి కల్పించడం కోసం సమర్థవంతంగా పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు అంశాలపై ఆయన మాట్లాడారు.

గత ఏడాది పని దినాలు, వేతన చెల్లింపుల వివరాలు?

గత ఏడాది 86 లక్షల పని దినాలు కూలీలకు కల్పించి లక్ష్యంలో 85.37 శాతం పూర్తి చేశాం. కూలీలకు సగటు వేతనం రూ. 272 చొప్పున చెల్లించడం జరిగింది. ఈ ఏడాది కొత్తగా సిసి రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం, చేపట్టబోతున్నాం. ఈ ఏడాది 330 నీటి కుంటలు తీయడం జరిగింది.

పల్నాడు జిల్లాలో పథకం పని తీరు, ఏ పనులు కల్పిస్తున్నారు?

పల్నాడు జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథ కం సమర్థవంతంగా పని చేస్తోంది. గ్రామీణ ప్రాంతా లలో 100 రోజులు, బొల్లాపల్లి, మాచర్ల, గురజాల లోని గిరిజన ప్రాంతాల్లో 150 రోజుల పనిదినాలు కల్పించి జాబ్ కార్డు కలి గిన ప్రతి కుటుంబానికి పని కల్పింస్తున్నాం. మొత్తం 266 పనులున్నాయి. చెరువులలో పంట కాలువలలో పూడికతీత పంట కాలువల మరమ్మతులు, నీటి కుంటలు, పశువుల షెడ్లు నిర్మాణానికి, గేదెలకు గడ్డి పెంపకం మొక్కలు నాటడం తోపాటు ఉద్యాన శాఖను అనుసంధానం చేసి 12 రకాల పండ్ల తోటలు, మల్లె గులాబీ, మునగ, ఆయిల్ ఫామ్ వంటి పంటల లపై రైతులకు అవగాహన కల్పించి ఆయా పంటలు సాగుకు సంబంధించి 3 ఏళ్ల పాటు ఎకరాకు ఏడాదికి రూ.30వేలు నుండి రూ.35 వేలు వరకు ఇస్తున్నాము.

పల్నాడు జిల్లాలో జాబ్ కార్డులు, కూలీలు, పని దినాల వివరాలు?

పల్నాడు జిల్లాలో 3.23 లక్షల జాబ్ కార్డులకు సంబం ధించి 5.55 లక్షల మంది కూలీలు ఉండగా 2. 56 లక్షల జాబ్ కార్డులకు సంబంధించిన 4.38 కూలీలు ఉపాధి పను లు చేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నెల జూన్ నెల వరకు 55 లక్షల పని దినాలు కల్పించాము. పల్నాడు జిల్లాలో ఇంతవరకు యంత్రాల ద్వారా ఎటువంటి పనులు చేపట్టలేదు.

ఉద్యాన పంటలకు సంబంధించి పల్నాడు జిల్లాలో లక్ష్యం?

పల్నాడు జిల్లాకు సంబంధించి వివిధ తోటల పూల మొక్కలు మునగ తోటలకు సంబంధించి 5600 ఎకరాల లక్ష్యం కాగా ప్రస్తుతం 595 మంది రైతులు 1321 ఎకరాలలో సాగు చేసేందుకు ముందుకు వచ్చారు. ముందుకు వచ్చిన రైతులకు పథకాలు రాయితీల గురించి గ్రామ స్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్, మండల స్థాయిలో ఏపిఓ, మండల పరిషత్ అధికారులు ఎప్పటికప్పుడు వివరించడం జరుగుతుంది. పండ్ల తోటలకు సాగుకు ప్రధానంగా బొల్లా పల్లి, వెల్దుర్తి, రైతులు అధిక సంఖ్యలో ముందుకు వస్తున్నారు.

ఉపాధి కూలీ డబ్బులు సకాలంలో అందడం లేదని విమర్శలు ఉన్నాయి, ఏ మేర బకాయిలు ఉన్నాయి?

ఎన్నికలు అనంతరం కౌంటింగ్ ప్రక్రియ నేపథ్యంలో ఉపాధి కూలీలకు వేతనాల చెల్లింపులో కొంత జాప్యం జరిగింది. ఏప్రిల్,మే, జూన్ 3 నెలలకు నెల వరకు సంబంధించిన రూ 40 కోట్ల కూలి డబ్బులు చెల్లించాల్సి ఉంది. దీనికి సంబంధించి ఉన్నతాధికారులు నివేదించడం జరిగింది ఆగస్టు మొదటి వారం లోపు పెండింగ్‌లో ఉన్న కూలీ డబ్బులు కూలీలకు చెల్లించడం జరుగుతుంది.

పని ప్రదేశంలో వసతులు పనిముట్లు పంపిణీ వివరాలు?

పని ప్రదేశంలో నీడ కోసం టెంట్లు కూలీలకు మంచి నీరు ఏర్పాటు చేస్తున్నాం దీనికి సంబంధించి నీడ కోసం టర్పాలిన్లు ప్రాథమిక చికిత్స కోసం కిట్లను ఓఆర్ఎస్ ప్యాకెట్లు వైద్యానికి శాఖ ద్వారా సమకూర్చుకోవడం జరుగు తుంది. దీనికి సంబంధించి గత ప్రభుత్వ హయాంలో ఎటు వంటి బడ్జెట్ కేటాయించలేదు. ప్రస్తుతం పనిముట్లను ఉపాధి కూలీల ఎవరికి వారు తెచ్చుకోవడం జరుగుతుంది. కూలీలకు పనిముట్లు సంబంధించి ప్రభుత్వానికి నివేదిం చాము.

భారీగా అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి?

పల్నాడు జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగానే అమలు చేస్తున్నప్పటికీ కొంత మేర అవినీతి జరుగుతుంది. అయితే అవినీతిని ఉపేక్షించేది లేదు. కొన్ని ప్రాంతాల నుండి ఫిర్యాదులు వచ్చాయి. వాటిని సామాజిక తనిఖీల ద్వారా పరిశీలించిన రికవరీ చేయడం జరిగింది. పథకంలో అవినీతి ఆరోపణలు నిరూపణ అయితే ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదు. కుల మతాలకు పార్టీలకు అతీతంగా జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి పని దినాలు కల్పిస్తున్నాం. కూలీలు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సామాజిక తనిఖీ అధికారులు జరిపిన గ్రామ సభలలో ఏమైనా ఫిర్యాదులు వస్తే గ్రామంలో జాబ్ కార్డు కలిగిన వారి ఇంటింటికి వెళ్లి పథకం ద్వారా కలిగిన లబ్ధిని అడిగి తెలుసుకుంటారు. క్వాలిటి కంట్రోల్ బందం పథకం అమలు తీరుపై ఎప్పటికప్పుడు నిఘా ఉంటుంది. పథకాన్ని కులీలు సద్వినియోగం చేసుకోవాలి.